శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; హేమంత రుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం తదియ: మ. 11 55 తదుపరి చవితి పుష్యమి: తె. 327 తదుపరి ఆశ్లేష వర్జ్యం: ఉ. 1110 నుంచి 1248 వరకు అమృత ఘడియలు: రా. 856 నుంచి 1034 వరకు దుర్ముహూర్తం: ఉ. 1134 నుంచి 1218 వరకు రాహుకాలం: మ. 1200 నుంచి 130 వరకు సూర్యోదయం: ఉ. 6.28; సూర్యాస్తమయం: సా.5.25 సంకటహర చతుర్థి

# సిటీ టైమ్స్

తెలుగు దినపత్రిక

గురువారం- 19- డిసెంబర్ 2024 | సంపుటి : 25 సంచిక : 178 | పేజీలు - 8 వెల : రూ 3 | www. citytimes news.com

## తెలంగాణ టెట్ షెడ్యూల్ విడుదల



**హైదరాబాద్:** తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్‌ను పాఠశాల విద్యశాఖ డైరెక్టర్ విడుదల చేశారు. సబ్జెక్టుల వారీగా షెడ్యూల్‌ను విడుదల చేశారు. జనవరి 2 నుంచి 20 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం.. రెండు సెషన్లుగా 9 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈసారి టెట్ పేపర్ 1, పేపర్ 2లకు కలిపి సుమారు 2.75 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.

# కాంగ్రెస్ 'చలో రాజ్‌భవన్'..

## రోడ్డుపై బైఠాయించి సీఎం రేవంత్ నిరసన




### అదానీ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా

### భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకుపోయాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శ

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):** మణిపూర్ అల్లర్లు, గౌతమ్ అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్‌భవన్' చేపట్టారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు దీనిలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం రాజ్‌భవన్ సమీపంలో రోడ్డుపై సీఎం రేవంత్, మంత్రులు, నేతలు బైఠాయించి నిరసన తెలిపారు.

(మిగతా 2 లో)

# ఫార్ములా ఈ రేస్‌పై అసెంబ్లీలో చర్చ పెట్టండి

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ



**హైదరాబాద్,(సిటీ టైమ్స్):** ఫార్ములా ఈ రేస్ వ్యవహారంపై ఈ శాసనసభ సమావేశాల్లోనే చర్చ పెట్టాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఫార్ములా ఈరేస్ వ్యవహారంలో ఎలాంటి అవకతవకలు, అవినీతి జరగలేదని.. శాసనసభలో సవివర చర్చ జరిగితే నిజాలేమిటో నిగ్గుతేలుతాయని పేర్కొన్నారు. ఫార్ములాఈ రేస్ వ్యవహారంలో కొన్ని నెలలుగా గత భారాస ప్రభుత్వం మీద, ముఖ్యంగా తనపై ప్రభుత్వం అనేక నిరాధార అరోపణలు చేస్తోందని కేటీఆర్ ఆక్షేపించారు. మంత్రివర్గ సమావేశంలోనూ గంటన్నర సేపు చర్చ కూడా జరిగినట్లు

(మిగతా 2 లో)



## విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాలనే కసి సీఎంలో కనిపిస్తోంది

### సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):** ఏ ప్రభుత్వానికైనా విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలనే ఉంటుందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. విద్యాలయాలను బాగు చేయాలని భారాస అధినేత కేసీఆర్‌కు మొదట్లో ఉండేదని.. ఆ తరువాత ఆయన అంచనాలు మారిపోయాయన్నారు. విద్యాలయాలు, వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనపై అసెంబ్లీలో జరిగిన స్వల్ప కాల చర్చలో పలువురు ఎమ్మెల్యేలు

(మిగతా 2 లో)

## మహానగరం సిగలో మరో మణిహారం..

# 28న చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభం

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):** చర్లపల్లి రైల్వే టెర్మినల్ మహానగరం సిగలో మరో మణిహారం కానుంది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా సుమారు రూ.430 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ టెర్మినల్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 28న రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించనున్నారు.

**ఆధునిక సౌకర్యాలతో..**

ఈ స్టేషన్ భవనంలో ఆరు ఎస్కలేటర్లు, ఏడు లిఫ్టులు, ఆరు బుకింగ్ కౌంటర్లు, పురుషులు, మహిళలకు వేర్వేరు వెయిటింగ్ హాళ్లు, హైక్లాస్ వెయిటింగ్ ఏరియా, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎగ్జిక్యూటివ్ లాంజ్ ఉంది. మొదటి అంతస్తులో కెఫెటేరియా, రెస్టారంట్, రెస్ట్‌రూమ్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కొత్త డిజైన్‌లో ప్రయాణికుల రాకపోకలకు విశాలమైన స్థలం (కాన్కోర్స్), ముందువైపు ప్రకాశవంతమైన లైటింగ్‌తో ఆధునిక ఎలివేషన్‌ను తీర్చిదిద్దారు. ప్రయాణికులకు ఉచిత వైఫై సదుపాయం కల్పించనున్నారు. హైదరాబాద్ శివారులోని ఈ



టెర్మినల్ అందుబాటులోకి వచ్చాక.. పలు రైళ్లు ఇక్కడి నుంచే ప్రారంభం కానున్నాయి. తద్వారా జంటనగరాల్లోని ప్రధాన రైల్వే స్టేషన్లపై ఒత్తిడి తగ్గించాలనేది రైల్వే శాఖ లక్ష్యం. ఈ టెర్మినల్ అందుబాటులోకి వచ్చాక నగరంలోని నాంపల్లి, కాచికూడ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లపై ప్రయాణికుల ఒత్తిడి గణనీయంగా తగ్గిపోనుంది. ఇక్కడి నుంచే నగరం నలుమూలలకు ప్రయాణికులు సులువుగా చేరుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికే నడుస్తున్న రైళ్లకు అదనంగా కొత్తగా మరో 25 జతల రైళ్లు ఇక్కడి నుంచి పరుగుల తీయనున్నాయి. లక్షల్లో ప్రయాణికులు రాకపోకలు సాగించనున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజారవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టింది.



## 'మూసీ'పై అబద్ధాలు ఎందుకు..

### ఎవరి లాభం కోసం?

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):** భారాస సభ్యులు మండలిలో అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తప్పుడు సమాధానాలు ఇస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్ ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు విషయంలో మంత్రి శ్రీధర్‌బాబు సభను తప్పుదోవ పట్టించారన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కవిత మాట్లాడారు.

(మిగతా 2 లో)

# బంగాళాఖాతంలోకి 'ధరణి' పోర్టల్

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):** భేషజాలకు పోయి 'ధరణి'ని మార్చడం లేదని.. ప్రజాసమస్యల పరిష్కారానికే ఆ పోర్టల్‌ను రద్దు చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పోర్టల్ వల్ల 4 నెలలు రిజిస్ట్రేషన్లు జరగలేదన్నారు. శాసనసభలో 'భూభారతి' బిల్లును పొంగులేటి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ''ధరణితో అనేక మంది ఇబ్బందులు పడిన మాట వాస్తవం. ఆ పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామని

(మిగతా 2 లో)



## కూల్చివేతలపై కీలక ప్రకటన..

# హైడ్రా విధివిధానాలు వివరించిన రంగనాథ్

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):** నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కీలక ప్రకటన చేసింది. హైడ్రా ఏర్పడక ముందు అనుమతిచ్చిన ఏ కట్టడాలనూ హైడ్రా కూల్చదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. ''అనుమతి లేకుండా కట్టిన నివాస గృహాలు జులై 2024కి సిద్ధమై, వాటిలో నివాసం ఉంటే హైడ్రా కూల్చదు. ఎఫ్‌టీఎల్‌లో అనుమతులు లేకుండా కట్టిన వాణిజ్య, వ్యాపార కట్టడాలను మాత్రం కూల్చక తప్పదు. గతంలో అనుమతులు ఇచ్చి తరువాత రద్దు చేస్తే అవి అక్రమ కట్టడాలే అవుతాయి. అనుమతులు రద్దైనా

(మిగతా 2 లో)





## ముంబయిలో ఫెర్రీ ప్రమాదం..

### 13 మంది మృతి

**ముంబయి,(సిటీ టైమ్స్):** ముంబయి సముద్ర తీరంలో పెను విషాదం చోటుచేసుకుంది. పర్యాటకులతో వెళ్తున్న పడవను నేవీకి చెందిన బోటు ఢీకొట్టిన ఘటనలో 13 మంది మృతిచెందారు. ఈ విషయాన్ని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అధికారికంగా ప్రకటించారు. ఈ ఘటనలో 101 మందిని కాపాడినట్లు తెలిపారు. చనిపోయిన వారిలో 10 మంది పర్యాటకులు కాగా.. ముగ్గురు నేవీ సిబ్బంది ఉన్నట్లు ప్రకటించారు. 'గేట్ వే ఆఫ్ ఇండియా' నుంచి ఎలిఫెంటా

## పదేళ్లలో మీరు పెట్టిన బురద కడిగేందుకే సరిపోతోంది

### హరీశ్‌రావుకు మంత్రి పొన్నం కౌంటర్

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):** తెలంగాణ శాసనసభలో గురుకులాలపై చర్చ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం నడిచింది. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ''55 ఏళ్లుగా మీ ప్రభుత్వమే ఉంది కదా అని హరీశ్‌రావు అన్నారు. అన్యాయం జరిగిందనే కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మీరేం చేశారో చెప్పాలి. నేను విద్యార్థి నాయకుడిని, కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం కోసం పనిచేస్తుంది.

(మిగతా 2 లో)





## 'జమిలి'పై జేపీసీ ఏర్పాటు..

31మంది ఎంపీల పేర్లతో జాబితా! 2



## ఆటో డ్రైవర్లను భారాస మోసం చేస్తోంది

### మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):** ఆటో డ్రైవర్లను భారాస మోసం చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా ఆ పార్టీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ''పదేళ్లలో భారాస చేయని అభివృద్ధి ఏడాదిలో చేయమంటే ఎలా..? ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం. ఓవర్సీస్ ఉపకార వేతనాలను ఎక్కడ ఆపలేదు. భారాస సభ్యులు సభను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తన

(మిగతా 2 లో)





# 'జమిలి'పై జేపీసీ ఏర్పాటు..

## 31మంది ఎంపీల పేర్లతో జాబితా!

**జమిలి ఎన్నికల బిల్లుల పరిశీలన కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.**

దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏక కాలంలో నిర్వహించేందుకు ఉద్దేశించిన జమిలి ఎన్నికల బిల్లుల పరిశీలన కోసం కేంద్ర ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీ(JPC)ని ఏర్పాటు చేసింది. పలు పార్టీలకు చెందిన మొత్తం 31మంది ఎంపీల పేర్లను జేపీసీ ఏర్పాటుకు జాబితాను ప్రతిపాదించింది. ఇందులో 21 మంది లోక్‌సభ ఎంపీలు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు.

**జేపీసీలో సభ్యులు వీరే..!**

జేపీసీ ఏర్పాటుకు సంబంధించి గురువారం సభలో ప్రవేశ పెట్టే జాబితాలో 21 మంది లోక్‌సభ సభ్యులను జాబితాలో పేర్కొంది. వీరిలో పీపీ చౌదరి, సీఎం రమేశ్, బాన్సురీ స్వరాజ్, పురుషోత్తమ్ రూపాలా, అనురాగ్ ఠాకూర్, విష్ణు దయాళ్‌రామ్, భర్తృహరి మహ్తాబ్, సంబిత్ పాత్రా, అనిల్ బలూనీ, విష్ణుదత్ శర్మ, ప్రియాంకా గాంధీ వాద్రా, మనీష్ తివారీ, సుఖదేవ్ భగత్, ధర్మేంద్ర యాదవ్, కల్యాణ్ బెనర్జీ, టీఎం సెల్వ గణపతి, జీఎం హరీశ్ బాలయోగి, సుప్రియా సూలే, శ్రీకాంత్ శిందే, చందన్ చౌహాన్, వల్లభనేని బాలశౌరి ఉన్నారు. వీరితో పాటు రాజ్యసభ నుంచి 10 మంది సభ్యుల పేర్లను ప్రతిపాదించారు. దీనికి సంబంధించిన తీర్మానాన్ని న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ గురువారం ప్రవేశ పెట్టనున్నారు. మరోవైపు, జేపీసీ ఛైర్‌పర్సన్‌గా కేంద్ర మాజీ సహాయమంత్రి పీపీ చౌదరి ఉండే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ బరిలో అనురాగ్ ఠాకూర్ పేరు కూడా వినబడుతోంది. నిబంధనల ప్రకారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. జేపీసీలో 21మంది లోక్‌సభ సభ్యులకు గాను 14మంది ఎన్డీయే నుంచి ఉండగా.. వీరిలో 10మంది భాజపాకు చెందినవారే ఉన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల చివరివారంలో ఈ కమిటీ నివేదిక సమర్పించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దేశంలో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఓటింగ్ ప్రక్రియ ద్వారా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈ బిల్లును సభ ముందుకు తీసుకొచ్చారు. 90 నిమిషాల చర్చ అనంతరం ఓటింగ్ జరగ్గా బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 269 మంది, వ్యతిరేకంగా 198 మంది ఓటేశారు. దీంతో బిల్లును ప్రవేశపెట్టడానికి స్పీకర్ ఓం బిర్లా ఆమోద ముద్ర వేశారు. అయితే ఈ బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా కేంద్రం నియంతృత్వంగా వ్యవహరించిందని ప్రతిపక్షాలు ధ్వజమెత్తగా.. కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నందున సంయుక్త పార్లమెంటరీ కమిటీకి (జేపీసీ) పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అధికార పక్షం మాత్రం ఈ బిల్లు రాజ్యాంగ మూల స్వరూపానికి ఏమాత్రం భిన్నంగా లేదని స్పష్టం చేస్తూనే.. అన్ని పక్షాలూ దీనిపై విస్తృత చర్చ కోరుతున్నందున జేపీసీకి పంపడానికి తమకేమీ అభ్యంతరం లేదని పేర్కొన్న విషయం తెలిసిందే.

# కాంగ్రెస్ 'చలో రాజ్‌భవన్'..

(మొదటి పేజీ తరువాయి)

**అదానీ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా: సీఎం రేవంత్‌రెడ్డి**

భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకుపోయాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. వ్యాపారాలు చేయాలంటే లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్లుగా దేశ ప్రతిష్ఠను పెంపొందించిందని చెప్పారు. అదానీ, ప్రధాని కలిసి దేశం పరువు తీశారని ఆరోపించారు. ప్రపంచ దేశాల ముందు భారత్ పరువును తాకట్టుపెట్టారని ఆక్షేపించారు. మణిపుర్ అల్లర్లు, అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్‌భవన్' చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్ సమీపంలో సీఎం బైఠాయించిన నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. ''అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయి. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఫ్‌బీఐ నివేదించడంతో అక్కడి ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. దేశం పరువును మంటగలిపిన అదానీపై విచారణ జరగాలి. దీనిపై విచారణకు జేపీసీ నేతృత్వం వహించాలి. అదానీ అవినీతిపై చర్చ, జేపీసీ వేసేందుకు కేంద్రం సిద్ధంగా లేదు. అలా చేస్తే అదానీ జైలుకి వెళ్లాల్సి వస్తుంది. ఆయన్ను కాపాడేందుకు ప్రధాని మోదీ యత్నిస్తున్నారు. ఈ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా చేస్తాం.





**భారాస.. ప్రజల వైపా? అదానీ-ప్రధాని వైపా?**

అరెస్టుల నుంచి తప్పించుకోవడానికి భాజపాకు భారాస లొంగిపోయింది. అందుకే అదానీకి వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. భారాస.. ప్రజల వైపా? అదానీప్రధాని వైపా? అనేది తేల్చి చెప్పాలి. మోదీకేసీఆర్ వేర్వేరు కాదు.. ఇద్దరూ నాణేనికి బొమ్మాబొరుసు. భారాసకు చిత్తశుద్ధి ఉంటే అదానీ అవినీతిపై జేపీసీకి డిమాండ్ చేయాలి. ఆ పార్టీ కోరితే శాసన సభలో చర్చకు అనుమతిస్తాం. అదానీ అవినీతిపై జేపీసీ కోసం సభలో ఏకగ్రీవ తీర్మానం చేద్దాం. ప్రధాని అండగా నిలబడినా.. ప్రజాకోర్టులో అదానీని శిక్షించే వరకు పోరాడుతాం'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.



# కూల్చివేతలపై కీలక ప్రకటన..

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణాలు జరుగుతుంటే అక్రమ కట్టడాలుగానే పరిగణిస్తాం. పేదలను ముందు పెట్టి వెనుక నుంచి చక్రం తిప్పుతున్న ల్యాండ్ గ్రాబర్స్ చర్యలను హైడ్రా తీవ్రంగా పరిగణిస్తుంది. మల్లంపేట కొత్వాల్ చెరువు, అమీన్‌పూర్‌లో కూల్చివేసినవి అక్రమ కట్టడాలే. ఎఫ్‌టీఎల్ మార్కింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. కాలనీ సంక్షేమ సంఘాలు, ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు హైడ్రా ప్రాధాన్యత ఇస్తుంది. 12 చెరువుల్లో కూల్చివేతలు చేపట్టాం.. చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే పనులు మొదలు పెడతాం. 5 నెలల అనుభవాల నుంచి హైడ్రా అనేక అంశాలపై స్పష్టమైన వైఖరితో ముందుకెళ్తోంది. లోటుపాట్లు ఏమైనా ఉంటే వాటిని సవరించుకొని మరింత నిబద్ధతతో హైడ్రా పనిచేస్తోంది. వివిధ సందర్భాలలో కోర్టులు ఇచ్చిన తీర్పులకు లోబడి హైడ్రా ముందుకు వెళ్తోంది. ప్రభుత్వం దిశానిర్దేశం మేరకు హైడ్రా పని చేస్తుంది. హైడ్రాను బలోపేతం చేయడానికి ప్రభుత్వం పలు అధికారాలను కట్టబెట్టింది. సాంకేతికంగా కూడా మరింత బలంగా తయారవుతుంది. గత 5 నెలల్లో హైడ్రా దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది'' అని కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

# ముంబయిలో ఫెర్రీ ప్రమాదం..

(మొదటి పేజీ తరువాయి)

గుహలకు 'నీల్‌కమల్' అనే ఫెర్రీ.. దాదాపు 100 మందికి పైగా పర్యాటకులతో బయలుదేరింది. ఈ క్రమంలో చక్కర్లు కొడుతూ వేగంగా వచ్చిన నేవీకి చెందిన ఓ స్పీడ్ బోటు దాన్ని బలంగా ఢీకొట్టింది. దాంతో ఫెర్రీ సముద్రంలో మునిగిపోయింది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 13కి చేరింది. అయితే, ఘటనా సమయంలో ఫెర్రీతోపాటు నేవీ బోటులో ఎంత మంది చొప్పున ఉన్నారనే విషయంపై పూర్తి స్పష్టత లేదు. ఈ మధ్యాహ్నం 3.55 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుందని సీఎం దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. రాత్రి 7.30గంటల సమయానికి 101 మందిని సురక్షితంగా కాపాడగా.. 13మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ ఘటనలో తీవ్రగాయాలైన వారిని నేవీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.5లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు. ఈ మొత్తం ఘటనపై పోలీసులు, నేవీ దర్యాప్తు చేస్తామని సీఎం వెల్లడించారు. మరోవైపు, ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే రెస్క్యూ బృందాలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. 11 నేవీ పడవలతో సహా తీర ప్రాంత దళాలకు చెందిన మూడు పడవలు, నాలుగు హెలికాప్టర్లు కూడా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. పోర్టు అధికారులు, కోస్ట్‌గార్డ్, మత్స్యకారుల సహాయక చర్యల్లో పాల్గొని 101 మందిని కాపాడాయి.



**స్పందించిన నేవీ..**

ఈ ఘటనపై భారతీయ నౌకాదళం స్పందించింది. స్పీడ్ బోటు ఇంజిన్ ట్రయల్స్ చేస్తున్న క్రమంలో సాంకేతిక లోపం తలెత్తిందని, దీంతో బోటు నియంత్రణ కోల్పోయి ఫెర్రీని ఢీకొన్నట్లు వెల్లడించింది. ఇదిలాఉంటే, ప్రమాద ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# ఫార్ములాఈ రేస్‌పై అసెంబ్లీలో చర్చ పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

వార్తా కథనాలు వచ్చాయని, కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ ఆమోదం వచ్చిందని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మీడియాకు రకరకాల లీకులు ఇస్తున్నారని పేర్కొన్నారు. నాలుగు గోడల మధ్య చర్చ కన్నా.. శాసనసభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలన్న సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములాఈ రేస్ నిర్వాహకులతో ఒప్పందం చేసుకుందని, 2023లో విజయవంతంగా రేస్ జరిగి అన్ని వర్గాల మన్ననలు అందుకొందని కేటీఆర్ లేఖలో గుర్తు చేశారు. రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల మేర లబ్ధి చేకూరినట్లు నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసిందని గుర్తు చేశారు. 2024లో మరో దఫా రేస్ జరగాల్సి ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసిందని విమర్శించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగిందన్న అపోహలు సృష్టించే ప్రయత్నాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి చేసే రేసును కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు బలి చేశారని ఆక్షేపించారు. ఫార్ములాఈ రేస్ ఒప్పందం పూర్తి పారదర్శకంగా జరిగిందన్న ఆయన... రేస్ నిర్వాహకులకు చెల్లింపులు కూడా పారదర్శకంగానే జరిగాయని గతంలో వివరంగా చెప్పినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం మాత్రం దుష్ప్రచారం మానడం లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు నిజాలేమిటో తెలుసుకునే హక్కు ఉందని, అసెంబ్లీలో ఈ అంశంపై చర్చ పెట్టి అన్ని విషయాలు వివరంగా చెబుదామని అన్నారు. శాసనసభాపతిని కలిసిన భారాస ఎమ్మెల్యేలు ఫార్ములాఈ రేస్‌పై ఈ సమావేశాల్లో చర్చ జరగాలని కోరారు. ఈ మేరకు సభాపతికి వినతిపత్రం సమర్పించారు.



# పదేళ్లలో మీరు పెట్టిన బురద కడిగేందుకే సరిపోతోంది

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించాం. మేము, మా ముఖ్యమంత్రి గురుకులాలకు వెళ్లాం. మీరు పదేళ్లలో గురుకులాలకు ఒక్క సొంత భవనం ఎందుకు కట్టలేదు. రాబోయే రోజుల్లో మెస్ ఛార్జీలు, అద్దె భవనాలకు బకాయిలు లేకుండా చూస్తామని సీఎం చెప్పారు. పదేళ్లలో ఒక్క వైస్ ఛాన్సలర్ పోస్టు భర్తీ చేయలేదు, టీచర్ల నియామకాలు లేవు, ప్రమోషన్లు లేవు..ఏం చేశారు? 10 ఏళ్లలో మీరు పెట్టిన బురద కడగడానికే సమయం సరిపోతోంది. హాస్టల్‌లో చదువుకుంటున్న 8లక్షల మంది పిల్లలకు ధైర్యం కల్పించేలా సభ ఉండాలి'' అని పొన్నం ప్రభాకర్ అన్నారు.



# విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాలనే కసి సీఎంలో కనిపిస్తోంది



(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ''విద్యా రంగాన్ని ప్రక్షాళన చేయాలనే కసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో కనిపిస్తోంది. స్కిల్స్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు నిర్ణయాలతో ఆ విషయం స్పష్టం అవుతోంది. అయితే, ముఖ్యమంత్రి ఒక్కరికే ఆ తపన ఉంటే సరిపోదు. పైనుంచి కింది స్థాయి వరకు ఆచరించాలి. ప్రభుత్వ విధానాల వల్ల ఉపాధ్యాయులు సంతోషంగా లేరు. పాఠశాల విద్యకు సంబంధించి 20వేల వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సర్వ శిక్షా అభియాన్ వాళ్లకు కనీస వేతనం అమలు చేయడం లేదు'' అని కూనంనేని పేర్కొన్నారు. ''ప్రజలు తమ ఏడాది సంపాదనలో విద్య, వైద్యానికే 90శాతం ఖర్చు చేస్తున్నారు. పేదవాళ్లు మరింత పేదవాళ్లవుతున్నారు. ఆశ్రమ, గురుకుల పాఠశాలలను గత ప్రభుత్వం పదేళ్లపాటు నిర్లక్ష్యం చేసింది. నాణ్యమైన విద్యను అందించకపోగా బర్రెలు, గొర్రెలు కాసేలా ప్రేరేపించారు. పేదవాడు విద్యకు దూరం కావాలని కేసీఆర్ ప్రభుత్వం కుట్ర చేసింది'' ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ ''ఏడాది కాలంలో వెయ్యి మంది గురుకుల పాఠశాలల విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారు. 40 మంది విద్యార్థులు చనిపోయారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని కల్పించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ పెరిగిపోతున్నాయి'' భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్

# ఆటో డ్రైవర్లను భారాస మోసం చేస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి'' అన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పదేళ్ల భారాస హయాంలో ఆ పార్టీ నేతలు రూ. వేలకోట్లు దోచుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం, మిషన్ కాకతీయ, దళితబంధు, ఈకార్ రేసుల్లో కమీషన్లు తీసుకున్నారన్నారు.

**భారాస సభ్యులపై స్పీకర్ ఆగ్రహం**

అనంతరం స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పందిస్తూ భారాస సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వివేకానంద వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నామన్నారు. మరో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తీరు మార్చుకోకపోతే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. సీనియర్ సభ్యులు కొత్త సభ్యులకు నేర్పించేది ఇదేనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.





# 'మూసీ'పై అబద్ధాలు ఎందుకు.. ఎవరి లాభం కోసం?

(మొదటి పేజీ తరువాయి)

''మూసీ ప్రాజెక్ట్ కోసం ప్రపంచ బ్యాంకు రుణం అడగలేదని శ్రీధర్‌బాబు చెబుతున్నారు. సెప్టెంబర్‌లో రుణం అడిగినట్లు సాక్ష్యాధారాలు బయటపెడుతున్నాం. డీపీఆర్ లేదని అసెంబ్లీలో చెబుతున్నారు. ప్రపంచబ్యాంకుకు సెప్టెంబర్ 19న ఇచ్చిన నివేదికలో డీపీఆర్ ఉందని పేర్కొన్నారు. అబద్ధాలు ఎందుకు? ఎవరి లాభంకోసం ఇదంతా చేస్తున్నారు? ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. భారాస అధికారంలో ఉండగా ప్రపంచ బ్యాంకును తెలంగాణలో అడుగుపెట్టనివ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్‌కార్పెట్ వేస్తోంది. కేంద్ర ప్రభుత్వాన్ని కూడా రూ.14వేల కోట్ల సాయం అడిగారు. మూసీ ప్రాజెక్టుపై అబద్ధాలు చెబుతున్న ఈ ప్రభుత్వాన్ని వదిలి పెట్టే ప్రసక్తే లేదు'' అని కవిత అన్నారు.

# బంగాళాఖాతంలోకి 'ధరణి' పోర్టల్

(మొదటి పేజీ తరువాయి)

హామీ ఇచ్చాం.. ఇప్పుడు వేస్తున్నాం. ధరణి స్థానంలో భూభారతిని తీసుకొస్తున్నాం. భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు లిఖితపూర్వకంగా సూచించిన అంశాలను పొందుపరిచాం. ముసాయిదా బిల్లును 40 రోజులు వెబ్‌సైట్‌లో ఉంచాం. ఎమ్మెల్యేలు, మేధావులు ఇచ్చిన అంశాలను డ్రాఫ్ట్‌లో పెట్టాం. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో ఒకరోజు చర్చ కూడా నిర్వహించాం. 18 రాష్ట్రాల్లో ఆర్ఓఆర్ చట్టాలను పరిశీలించి భూభారతి తీసుకొచ్చాం. ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని నియమిస్తాం. భూ వివాదాలపై అప్పీలుకు ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తాం. అనుభవదారుల కాలాన్ని కూడా ఈ కొత్త బిల్లులో పొందుపరిచాం. 33 మాడ్యూల్స్‌తో ఉన్న దాన్ని 6 మాడ్యూల్స్‌తో పునఃప్రక్షాళన చేస్తున్నాం''అని పొంగులేటి తెలిపారు.



# 'కాంగ్రెస్ అంబేడ్కర్ వ్యతిరేకి.. నా వ్యాఖ్యల్ని వక్రీకరించింది': అమిత్ షా

**దిల్లీ:** కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌కు వ్యతిరేకమని, రాజ్యసభలో నిన్న తాను చేసిన వ్యాఖ్యల్ని వక్రీకరించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. కాంగ్రెస్ దేశంలో అవాస్తవాలను వ్యాప్తిచేస్తోందని ధ్వజమెత్తారు. భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. అంబేడ్కర్‌ను అవమానిస్తే దేశం సహించదంటూ కాంగ్రెస్ సహా పలు విపక్షాలు మండిపడుతున్న వేళ ఆయన దిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా తాను మాట్లాడలేదని.. పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించిన తీరును ఖండిస్తున్నట్లు అమిత్ షా చెప్పారు. 'కాంగ్రెస్ అంబేడ్కర్ వ్యతిరేకి, రిజర్వేషన్ల వ్యతిరేకి, రాజ్యాంగ వ్యతిరేక పార్టీ. కాంగ్రెస్ ఏనాడూ అంబేడ్కర్ స్మారకాన్ని నిర్మించలేదు. భాజపా ప్రభుత్వం అంబేడ్కర్‌ను ఎంతో గౌరవించింది. కాంగ్రెస్ పార్టీ నా వ్యాఖ్యల్ని వక్రీకరించింది. నేను ఎన్నడూ అంబేడ్కర్‌ని అవమానించని పార్టీ నుంచి వచ్చా. ఎలాంటి గందరగోళం లేకుండా స్పష్టంగా ఉన్న నా ప్రసంగం రాజ్యసభ రికార్డుల్లో ఉంది. కలలో కూడా అంబేడ్కర్ ఆలోచలను అవమానించలేని పార్టీ, సిద్ధాంతం నుంచి వచ్చా. రాజ్యసభలో నా పూర్తి ప్రసంగాన్ని ప్రజలకు మీడియా చూపించాలి. నేను రాజీనామా చేస్తే ఖర్గే జీ సంతోషపడతారంటే.. అలాగే చేస్తాను. కానీ మరో 15 ఏళ్లు వారు ప్రతిపక్షంలోనే ఉండాలి. నా రాజీనామా దాన్ని మార్చలేదు'' అని అమిత్ షా అన్నారు.




# జేపీసీకి జమిలి.. కమిటీలో ప్రియాంక గాంధీ..!

**దిల్లీ:** దేశవ్యాప్తంగా ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు వీలుగా కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జమిలి ఎన్నికల రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రతిపక్షాల డిమాండ్‌తో ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి (జేపీసీ) పంపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును పరిశీలించే జేపీసీ నామినీ జాబితాలో కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ పేరు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆమెతో పాటు కాంగ్రెస్ నుంచి మనీశ్ తివారీ, రణ్‌దీప్ సూర్జేవాలా, సుఖ్‌దేవ్ భగత్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు.. ఈ కమిటీలో సభ్యులుగా కల్యాణ్ బెనర్జీ, సాకేత్ గోఖలేల పేర్లను తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. కాగా.. దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు అనువుగా 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టింది. 90 నిమిషాల చర్చ అనంతరం ఓటింగ్ జరగ్గా బిల్లుకు అనుకూలంగా 269 మంది.. వ్యతిరేకంగా 198 మంది ఓటేశారు. దీంతో బిల్లును ప్రవేశపెట్టడానికి స్పీకర్ ఓం బిర్లా ఆమోద ముద్ర వేశారు. అయితే.. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమంటూ ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇది భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నందున జేపీసీకి పంపాలని డిమాండ్ చేశాయి. దీంతో ఈ బిల్లును జేపీసీకి పంపారు. ఈ కమిటీలో ప్రియాంక గాంధీ కూడా సభ్యురాలు కానున్నట్లు తెలుస్తోంది.

# సమస్య చిన్నది... నిర్లక్ష్యం పెద్దది..

**మోటర్ స్టార్టర్ ను రిపేర్ చేయకపోవడంతో.....**
**వారం రోజులుగా పెద్దమండడి కస్తూర్బా లో ఏర్పడిన మంచినీటి సమస్య...**
**నీరు సరిపోక...బట్టలు ఉతుక్కోలేక... ఒకటి. రెండు కు. కూడా ఇబ్బందులు పడుతున్న విద్యార్థినీలు..**
**కలెక్టర్ స్పందించాలని కోరుతున్న విద్యార్థులు....**







**పెద్దమండడి సిటి టైమ్స్ డిసెంబర్ 18:** సంక్షేమ వసతి గృహాల్లో రాష్ట్రవ్యాప్తంగా సమస్యలు ప్రభుత్వాన్ని అతలాకుతలం చేస్తుంటే చిన్నచిన్న సమస్యలను పరిష్కరించకపోవడంతో అవి పెద్దవిగా మారి విద్యార్థుల పాలిట శాపంగా మారాయి.. పెద్దమండడి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో గత వారం రోజులుగా మంచినీటి సమస్య ఏర్పడింది ఇందుకు కారణం సంపు మోటర్ కు సంబంధించిన స్విచ్ ఆఫ్ ఆన్ స్టార్టర్ పనిచేయకపోవడంతో మంచినీటి సమస్య ఏర్పడింది.. సమస్య చిన్నదే అయినప్పటికీ ఇక్కడ నిర్లక్ష్యం మాత్రం పెద్దగా గానే కనిపిస్తుంది. మిషన్ భగీరథ సంపు నుండి బాత్రూంలో మరియు హ్యాండ్ వాష్ సింకు.. బట్టలు ఉతుక్కునే హౌస్ దగ్గరకు పైపు లైన్ ఉంటుంది ఇక్కడ స్టార్టర్ పనిచేయకపోవడం వల్ల నీటి సరఫరా అంతట నిలిచిపోయింది దీంతో పాఠశాల ఆవరణలో ఉన్న మరో బోరు మోటర్ ద్వారా వస్తున్న నీటిని బకెట్ల ద్వారా పట్టుకొని విద్యార్థులు బట్టలు ఉతుక్కోవడానికి బాత్రూములకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంది.. చాలాకాలంగా ఈ సమస్య ఉన్నట్లు విద్యార్థులు తెలిపారు.. పలుమార్లు స్టార్టర్ పనిచేయకపోవడం వల్ల రిపేరు చేయించిన మళ్లీ అదే సమస్య పునరావృతం అవుతుందని లో వోల్టేజ్ సమస్య కారణంగా స్టార్టర్ తరచుగా పని చేయడం లేదని సిబ్బంది తెలిపారు.. కస్తూరిబా పాఠశాల సిబ్బంది సమ్మెలో ఉండటం వల్ల బుధవారం హిందీ టీచర్ వెంకటమ్మ మరియు సైన్స్ అనిత ఉపాధ్యాయురాళ్ళు ఇద్దరు మాత్రమే పాఠశాలలో విధులకు హాజరయ్యారు. కలెక్టర్ స్పందించి అయిన ఇక్కడ ఉన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు దాదాపు 200 మందికి పైగా విద్యార్థులు ఉన్న ఈ కస్తూర్బా పాఠశాలలో సమస్య విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది చివరికి ఒకటి రెండు కు కూడా నీటి కొరత ఉన్నట్లు విద్యార్థులు తెలిపారు..

**అడిషనల్ కలెక్టర్ కు నోట్ ఫైల్ పంపించాం : జిల్లా బాలికల అభివృద్ధి అధికారిని శుభలక్ష్మి**

పెద్దమండడి కస్తూర్బా పాఠశాలలో నెలకొన్న మంచినీటి సమస్యపై జిసిడిఓ శుభ లక్ష్మి మాట్లాడుతూ.. విద్యుత్ సమస్య కారణంగా పాఠశాలలో కొంత నీటి సమస్య ఏర్పడింది వాస్తవమని జిల్లా అడిషనల్ కలెక్టర్ కు నీటి సమస్యపై నోట్ ఫైల్ పంపడం జరిగిందని బాత్రూములకు నీరు సరఫరా అవుతున్నదని ఒకటి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని జిసిడిఓ తెలిపారు..



## ఖాళీ స్థలాల సరిహద్దులను డిజిటైజ్ చేసి జియో ఫెన్సింగ్ చేయాలి: కమిషనర్ ఇలంబర్తి

**హైదరాబాద్,డిసెంబర్ 18,సిటీ టైమ్స్:** కాలనీ లేఅవుట్ లలోని అన్ని పార్కులు, ఖాళీ స్థలాల సరిహద్దులను చీఫ్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ విభాగం సమన్వయంతో డిజిటైజ్ చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్లు, చీఫ్ సిటీ ప్లానర్ లతో కలిసి కమీషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... కాలనీ లేఅవుట్ లలోని అన్ని పార్కులు, ఖాళీ స్థలాల సరిహద్దులను డిజిటైజ్ చేసి జియో ఫెన్సింగ్ చేయాలని తెలిపారు. ప్రతి ట్రీ పార్కులకు, ఖాళీ స్థలాలకు ప్రత్యేక ఐ.డి ఇవ్వాలని తెలిపారు. 2000 చదరపు గజాల కంటే ఎక్కువ ఖాళీ ప్రదేశాలను పార్కులుగా అభివృద్ధి చేయాలన్నారు. పార్క్ ప్రాంగణంలో అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు చేపట్టాలని, ఏదైనా ఉల్లంఘనలు గుర్తించబడితే తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని సర్కిల్ మేనేజర్లు, ఫీల్డ్, టెక్నికల్, హార్టికల్చర్ అసిస్టెంట్లు తమ పరిధిలోని పార్కులను కనీసం నెలకు ఒకసారి సందర్శించి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ లతో సమావేశాలు నిర్వహించి పార్క్ తనిఖీ నివేదిక ఫార్మాట్ ద్వారా ప్రతి నెల 5వ తేదీలోపు అర్బన్ బయోడైవర్సిటీ అదనపు కమిషనర్ కు నివేదిక సమర్పించాలని తెలిపారు. పార్క్ నిర్వహణ గురించి వాకర్స్/స్టేక్ హోల్డర్స్/కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ల సభ్యుల నుండి అభిప్రాయాన్ని తెలుసుకొని, సందర్శకుల నుండి వచ్చిన ఈ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా కాంట్రాక్టర్లకు చెల్లింపులను విడుదల చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. పార్క్ ప్రాంగణంలో ప్లాస్టిక్‌ను నిరోధించడానికి ఒక ప్రతిపాదనను సమర్పించాలి, దానిని నియంత్రించే పద్ధతులు చేపట్టాలన్నారు. ఇతర శాఖల ద్వారా చెట్ల నరికివేతను సకాలంలో తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు . అవసరమైన సాధనాలు, ఇన్‌పుట్ లను ఉపయోగించి కత్తిరింపు పద్ధతిపై స్పష్టమైన సూచనలను జారీ చేయడానికి అనుబంధ లైన్ డిపార్ట్‌మెంట్ లతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించాలని తెలిపారు. సెక్యూరిటీ గార్డుల వారి సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవలన్నారు. పార్కుల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా సెక్యూరిటీ వారు కృషి చేయాలన్నారు అర్బన్ బయోడైవర్సిటీ విభాగం యొక్క టికెటింగ్, ధర, రాబడి మొదలైనవాటిని పటిష్టమైన పద్ధతులు అనుసరించాలని అన్నారు రింగ్ ఫెన్సింగ్/ఫ్లో బ్యాక్ సిస్టమ్ కోసం మెకానిజం అభివృద్ధి కి చర్యలు తీసుకుని తద్వారా పార్క్ అభివృద్ధి నిర్వహణ కోసం ఆదాయాన్ని వినియోగించుకోవాలన్నారు . హరిత నిధి కింద వచ్చిన సొమ్మును పార్కుల్లో పచ్చదనం పెంపొందించేందుకు అటవీ శాఖకు బదులుగా జీహెచ్ఎంసీ వద్ద ఉంచవచ్చా లేదా అనేది దానిపై ఈ సమావేశంలో చర్చించారు. పావురాలను బహిరంగ ప్రదేశాల్లో తినిపించడం వల్ల పట్టణ ప్రాంతాల్లో జీవవైవిధ్యం ఇబ్బంది కారణంగా ఉండే అవకాశం ఉన్ననేపథ్యంలో , పశు వైద్య విభాగం సంప్రదించి బహిరంగ ప్రదేశాల్లో పావురాల దాణాను వేయకుండా మార్గాలను పరిశీలించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ సుభద్ర దేవి, శ్రీనివాసరావు, సునంద రాణి, చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, విజిలెన్స్ విభాగం అదనపు పోలీసు సూపరింటెండెంట్ శ్రీనివాస్,, అదనపు కమిషనర్ ఎస్టేట్,స్రామాట్ అశోక్ అదనపు కమిషనర్ లేక్స్ శివకుమార్ నాయుడు, జాయింట్ కమిషనర్ ఐటీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## రూ.224 కోట్ల సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేయండి



**-కేంద్ర మంత్రి గడ్కరీకి బండి సంజయ్ వినతి**
**-సానుకూలంగా స్పందించిన గడ్కరీ**
**మానేరుపై హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించాలని కోరిన బండి**

**ఢిల్లీ ప్రతినిధి, సిటీ టైమ్స్:** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని గ్రామాలకు రవాణా సదుపాయాలను మెరుగుపర్చేందుకు రూ.224 కోట్ల మేరకు సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లు, వంతెనల అభివృద్ధికి సంబంధించి పలు అంశంపై గడ్కరీ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా సింగిల్ లేన్ నుండి డబుల్ లేన్ రోడ్ల విస్తరణ పనులకు సంబంధించిన ప్రతిపాదనను ఆయన ముందుంచారు. ప్రధానంగా కేశవపట్నం నుండి పాపయ్యపల్లె మీదుగా సైదాపూర్ వరకు 15 కి.మీల మేరకు సింగిల్ రోడ్డును డబుల్ లేన్ గా విస్తరించాలని, కొడిమ్యాల నుండి గోవిందారం మీదుగా తాండ్రియాల వరకు 30 కి.మీల మేరకు సింగిల్ లేన్ రోడ్డును డబుల్ లేన్ గా విస్తరించాలని కోరారు. అట్లాగే చొప్పదండి మండలం అర్నకొండ నుండి గోపాల్ రావు పేట మీదుగా మల్యాల చౌరస్తా వరకు 45 కి.మీల మేరకు, ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ నుండి సింగారం మీదుగా ముస్తాబాద్ మండలం రాంరెడ్డి పల్లె వరకు 15 కి.మీల మేరకు సింగిల్ లేన్ రోడ్డును డబుల్ లేన్ గా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు కరీంనగర్ జిల్లాలోని గుండ్లపల్లి పోతూరు రోడ్ (కి.మీ 18/0 2), బావూపేట ఖాజీపూర్ ( కి.మీ2/02) వరకు మానేరు నదిపై హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం సహా మొత్తం 90 కి.మీల మేరకు రోడ్డు విస్తరణ పనులకుగాను రూ.224 కోట్ల నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీకి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా కేంద్ర మంత్రి గడ్కరీ త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని బండి సంజయ్ కు హామీ ఇచ్చారు. దీంతోపాటు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే సీఆర్ఐఎఫ్ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపైనా గడ్కరీ ఆరా తీశారు.

# వీ ఆర్ ఓ ల స్థానాలలో పంచాయితీ రాజ్ సిబ్బందిని నియమించాలి...

**పంచాయతీరాజ్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గట్టు మీది భానుప్రసాద్..**
**ప్రధాన కార్యదర్శి సయ్యద్ రషీద్..**



**వనపర్తి బ్యూరో సిటి టైమ్స్ డిసెంబర్ 18:** వనపర్తి జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో కొత్తగా ఏర్పడిన మండల పరిషత్ కార్యాలయాల యందు పర్యవేక్షకుల మరియు సీనియర్ సహాయకుల ఎగనెస్ట్ పోస్ట్ లలో పనిచేయుచున్న VRO లను ఖాళీగా గల జూనియర్ అసిస్టెంట్ / టైపిస్టు పోస్టులలో నియమించాలని అలాగే వివిధ మండలాలో పనిచేస్తున్న VRO ను జిల్లా లోని వివిధ ఉన్నత పాటశాలలో నియమిస్తూ అక్కడ పనిచేస్తున్న పంచాయితీ రాజ్ సిబ్బందిని మండల ప్రజా పరిషత్ లకు మార్చాలని పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు గట్టుమీది భానుప్రసాద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ రషీద్ జిల్లా ప్రజా పరిషద్ ముఖ్య కార్య నిర్వహణాధికారి యాదయ్యమరియు ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి CM రాం మహేశ్వర్ రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. వనపర్తిజిల్లా పరిదిలో కొత్తగా మంజూరైన అమరచింత, మదనాపూర్, శ్రీరంగాపూర్, చిన్నంబావి మరియు రేవల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయాలకు మంజూరైన పర్యవేక్షకులు మరియు సీనియర్ సహాయకుల పోస్టులలో పోస్టులలో (23) మంది VRO లను బైపోస్టుల ల్లో 2022 ఆగష్టు 2న గతములో నియమించారని, జూనియర్ అసిస్టెంట్ హోదా గల వీరు, సీనియర్ అసిస్టెంట్ మరియు పర్యవేక్షకుల స్థానాల్లో ఉండడం వలన అట్టి స్థానాలు ఖాళీలుగా చూపక పోవడం వలన న్యాయబద్ధంగా రావలసిన పదోన్నతుల కొరకు అనేక సంవత్సరాలుగా ఎదురుచూడవలసి వస్తున్నదని పంచాయతీ రాజ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారని తెలిపారు. కావున వనపర్తి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ పరిధిలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ స్థానాలలో నూతన మండలములలో పర్యవేక్షకుల హోదాలో ఉన్న వారిని తిరిగి జూనియర్ అసిస్టెంట్ గా సర్దుబాటు చేసి పర్యవేక్షకుల స్థానాలను ఖాళీలుగా చూపినట్లైతే అన్ని క్యాడర్లలో ఉన్న వారికి సీనియర్ అసిస్టెంట్ నుండి పర్యవేక్షకులుగా, జూనియర్ అసిస్టెంట్ నుండి సీనియర్ అసిస్టెంట్ గా రికార్డ్ అసిస్టెంట్ నుండి జూనియర్ అసిస్టెంట్ గా, ఆఫీస్ సబార్డినేట్ నుండి రికార్డ్ అసిస్టెంట్ గా అన్ని క్యాడర్ లలో వున్న అనేక మంది ఉద్యోగులకు పదోన్నతులకు అవకాశం ఉంటుంది అని, మినిస్టీరియల్ ఉద్యోగులకు న్యాయమైన పదోన్నతులకు అవకాశం కల్పించాలని పంచాయత్ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం, వనపర్తి జిల్లా తరపున జిల్లా ప్రజా పరిషద్ ముఖ్య కార్యనిర్వహణాధికారి యాదయ్యకు మరియు ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి CM రాం మహేశ్వర్ రెడ్డి నేడు వినతిపత్రం అందజేశామని పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు గట్టుమీది భానుప్రసాద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు.ఇట్టి కార్యక్రమములో సహా అధ్యక్షులు పరమేశ్వర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, నాగేశ్వర్ రెడ్డి, ఇబ్రహీం, సిబ్బంది రాఘవేందర్ రెడ్డి, విజయ్ రాజ్ మల్లేష్, శ్రీకాంత్, భరత్, సతీష్, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

**- నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి జగదీశ్వర్ గౌడ్**

**శేరిలింగంపల్లి,సిటీటైమ్స్:** నిరుపేదలు అనారోగ్యానికి గురై మెరుగైన వైద్యం చేయించుకోవడానికి అత్యవసర సమయంలో వారికి అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. ఇటీవల శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్ పెట్ డివిజన్ హుడా కాలనీకి చెందిన కరుణాకర్, అల్విన్ కాలనీ డివిజన్ ఎన్టీఆర్ నగర్ ఎల్లమ్మబండకు చెందిన సయ్యద్ ఇస్మాయిల్ చికిత్స పొందిన అనంతరం శేరిలింగపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కార్యాలయాన్ని సంప్రదించారు. వారికి ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి జగదీశ్వర్ గౌడ్ బుధవారం వారికి మంజూరైన రూ. 1.20లక్షల చెక్కును నియోజకవర్గ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.




## క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించాలి: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

**సిటీటైమ్స్,దుండిగల్:** క్రైస్తవులు పవిత్రంగా పూజించే క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ కమిటీ సభ్యులకు సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ చర్చి గాగిల్లాపూర్ లోని సెంట్ ఇగ్నేటస్ చర్చిలో కమిటీ సభ్యుల ఆహ్వాన మేరకు ఈ నెల 25వ తేదీన క్రిస్మస్ పండుగ సందర్భంగా వారితో కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి, రంజిత్ రెడ్డి, చర్చి కమిటీ సభ్యులు రాజారెడ్డి, స్లీవా రెడ్డి, అర్ల రెడ్డి, బాల్ రెడ్డి, ప్రశాంత్, ప్రణీత్, సతీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా జీవించాలి: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

**సిటీటైమ్స్, దుండిగల్:** అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ తాండా 1లో కొర్ర శివ నాయక్ ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్రిష్ణ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో నిర్వహించే అయ్యప్ప స్వామి మహా పడి పూజ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్, సీనియర్ నాయకులు కొర్ర రవి నాయక్, 27వ వార్డు ప్రెసిడెంట్ అమర్ సింగ్, పీఏసీఎస్ డైరెక్టర్ మోహన్ నాయక్, నాయకులు హనుమంత్ నాయక్, ప్రవీణ్ నాయక్, కుమార్ నాయక్, సోను, స్థానిక నాయకులు, గురు స్వాములు, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## యూట్యూబర్ నటుడు రచయిత ప్రసాద్ బెహరపై లైంగిక వేధింపుల కేసు..



**హైదరాబాద్, డిసెంబర్ 18,సిటీ టైమ్స్:** షూటింగ్ సమయంలో తనను అసభ్యంగా తాకడంటూ ప్రముఖ తెలుగు యూట్యూబర్ నటుడు రచయిత ప్రసాద్ బెహరపై లైంగిక వేధింపుల కేసు నమోదు అయ్యింది. వివరాల్లోకి వెళితే.. తన సహచర నటిపై లైంగిక వేధింపులు చేశాడంటూ ఒక యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. షూటింగ్ సమయంలో తనను అసభ్యంగా తాకడంటూ ఫిర్యాదులో పేర్కొంది. ప్రముఖ తెలుగు యూట్యూబర్, నటుడు, రచయిత ప్రసాద్ బెహరను లైంగిక వేధింపుల కేసులో హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తుంది. వివరాల్లోకి వెళితే.. తన సహచర నటిపై లైంగిక వేధింపులు చేశాడంటూ ఒక యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. షూటింగ్ సమయంలో తన ప్రైవేట్ భాగాలను తాకుతూ, అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో ఈ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేసి.. రిమాండుకు తరలించినట్లు తెలుస్తుంది.పెళ్లివారమండిఅనే వెబ్ సిరీస్ టైంలో తనను లైంగికంగా వేధించినట్లు యువతి ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. అలాగే మెకానిక్ అనే వెబ్ సిరీస్ టైంలో కూడా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తుంది. యూట్యూబర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన ప్రసాద్ బెహరా తర్వాత రచయితగా నటుడిగా రాణిస్తున్నారు. రీసెంట్‌గా కమిటీ కుర్రోళ్లు అనే సినిమాలో నటించాడు ప్రసాద్. సోషల్ మీడియాలో ప్రసాద్ బాగా పాపులర్ ఆయ్యాడు. యూట్యూబ్‌లో ఆయన చేసిన వీడియోలకు మంచి ఆదరణ పెరిగింది.



## మళ్లీ తెరపైకి రెండో రాజధాని?

పార్లమెంట్ సమావేశాలు దేశ రాజధాని ఢిల్లీ వెలుపల, ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాల్లోని ఏదైనా రాష్ట్రంలో నిర్వహించాలని ఇటీవల డిమాండు వస్తోంది. ఇది దేశానికి రెండో రాజధాని అవసరమనే వాదనకు దారి తీయవచ్చునేది ఒక అభిప్రాయం. రాజధాని ఢిల్లీలో తీవ్రమైన వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో దక్షిణాదిలోనూ పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని ఇటీవల వైసీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు. ఈమేరకు ప్రధాని నరేంద్ర మోదీ, పార్లమెంటరీ వ్యవహా రాల శాఖ మంత్రి కిరణ్ రిజిజులకు ఆయన లేఖ రాశారు. ఢిల్లీలోని వాతావరణం వల్ల ఎంపీల పనితీరుపై ప్రతికూల ప్రభావం పడుతోందనీ, దక్షిణాదిన పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడం వల్ల ఈ ఇబ్బంది తొలగడంతో పాటు, జాతీయ సమగ్రత వెల్లివిరుస్తుందనీ ఆయన చెబుతున్నారు. దేశానికి మరో రాజధాని కావాలని ప్రత్యేకించి ఎవరూ ప్రస్తుతానికి డిమాండ్ చేయనప్పటికీ ఆ ప్రతిపాదన మాత్రం పాతదే. రాజధానిలోని పార్లమెంట్‌లో కాకుండా, బయట రాష్ట్రాల్లో సమావేశాలను నిర్వహిస్తే సాంకేతికంగా రెండో రాజధానిని అంగీకరించినట్లేనని కొందరు మేధావులు చెబుతున్నారు. అయితే ఈ అంశాన్ని మరికొందరు విభేదిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో, కొన్ని ప్రయోజనాల కోసం రాజధాని నగరాన్ని వినియోగిస్తార ని, ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఇతర రాష్ట్రాలు లేదా ప్రాంతాలను... వేర్వేరు ప్రయోజనాల కోసం వినియోగిస్తారనేది కొందరు మేధావుల అభిప్రాయం. ఈ విధంగా ప్రాధాన్యతనిచ్చే ఇతర నగరం మరో అధికారిక రాజధానిగా పరిగణించబడదని వారు చెబుతున్నారు.

చట్టబద్ధంగా నిర్వచించిన ఒక రాజధాని ఉన్న సంద ర్భంలో... రాజధాని అవసరాలు తీర్చేందుకు ప్రత్యేకంగా మరో రాష్ట్రంలోని నగరాన్ని రాజధానిగా పేర్కొని ఉపయో గించుకుంటే మాత్రం తప్పేమిటని మరికొందరు వాదిస్తు న్నారు. ఒకటికన్నా ఎక్కువ రాజధానులను కలిగి ఉన్న దేశాలు ప్రపంచంలో పదమూడు ఉన్నాయి. మూడు రాజ ధానీ నగరాలను కలిగి ఉన్న ఏకైక దేశంగా దక్షిణాఫ్రికా నిలి చింది. 'ప్రిటోరియా' పరిపాలన, కార్యనిర్వాహక రాజ ధానిగా; 'కేప్ టౌన్' శాసన రాజధానిగా, 'బ్లూమ్ ఫోంటైన్' న్యాయ రాజధానిగా ఉన్నాయి.

1950వ దశకం నుంచే దక్షిణ భారతదేశంలో పార్లమెంటు సమావేశాలు నిర్వహించాలి అన్న డిమాండ్ మొద లైందని ఎంపీ గురుమూర్తి చెబుతున్నారు. ఈ అంశంపై 1968లో స్వతంత్ర ఎంపీ ప్రకాశ్ వీర్ శాస్త్రి ప్రైవేట్ మెంబర్ బిల్లు కూడా పెట్టారనీ, నాడు 18 మంది ఎంపీలతో ఒక కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేశారనీ ఆయన గుర్తు చేస్తున్నారు. అప్పటి కేరళ, మైసూరు ప్రభుత్వాలు పార్లమెంటు సమావేశాలకు మౌలిక వసతులు కల్పిస్తామని ముందుకు వచ్చాయనీ, అయితే అప్పట్లో సాధ్యాసాధ్యాలు పరిశీ లించిన అనంతరం ఈ ప్రతిపాదనను ప్రభుత్వం తిరస్కరించిందన్నారు. అప్పటితో పోల్చితే వీడియో కాన్ఫ రెన్స్, ఇంటర్నెట్ వంటి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఇప్పుడు ఎంతో అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలు ఢిల్లీ వెలుపల నిర్వహించడం సాధ్యమైన విషయమేనని మేధావులు, పార్లమెంటేరియన్లు అంటున్నారు.

ప్రస్తుతం పార్లమెంట్ ఉభయ సభలు ఏడాదికి మూడు సార్లు సమావేశమవుతున్నాయి. జనవరి నెలాఖరున ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాలు మధ్యలో కొన్నాళ్ల విరామంతో రెండు విడతలుగా సాగుతాయి. జులై–ఆగస్ట్ నెలల్లో పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు, నవంబర్ – డిసెంబర్ మాసాల్లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతాయ నేది అందరికీ తెలిసిన విషయమే. ఈ మూడు సెషన్లలో కనీసం ఒకటైనా దక్షిణ భారతదేశంలో నిర్వహించా లని దక్షిణాదికి చెందిన వివిధ పార్టీల ఎంపీలు అభిప్రాయపడుతున్నారు. వారిలో కొందరైతే రెండు సమావేశాలను దక్షిణాదిన నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. దేశంలో జమ్మూ కాశ్మీర్‌కు రెండు రాజధానులు ఉన్నాయి. శ్రీనగర్ వేసవి రాజధాని, జమ్మూ శీతాకాల రాజ ధాని. రాష్ట్రానికే పరిపాలనా సౌలభ్యం కోసం, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రెండు రాజధానులు ఉన్న నేపథ్యంలో... దేశానికి ఉండడం అభ్యంతరం చెప్పాల్సిన విషయం కాదని కొందరంటున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ–కశ్మీర్ వంటి పలు రాష్ట్రాల్లో/ కేంద్ర పాలిత ప్రాంతాల్లో రెండు నగరాల్లో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో... దక్షిణ భారతదేశంలో పార్లమెంట్ సమావేశాల్లో ఒకటీ రెండు సెషన్లను నిర్వహించాలన్న డిమాండ్ సహేతుకంగానే ఉందని చెప్పవచ్చు. దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ దేశ రెండో రాజధాని రేసులో ఉన్నాయి.

# వికటించిన స్నేహం చిగురించేనా?




అంతర్జాతీయ పరిణామాలెప్పుడూ స్థిరంగా ఉండవు. నిన్న మొన్నటి వరకు భారత్ నుంచి పెద్ద ఎత్తున సహాయ సహకారాలు పొందిన పొరుగుదేశంబంగ్లాదేశ్‌లో మారిన అంతర్గత రాజకీయ పరిస్థితులు భారత్‌కు ఆందోళనకరంగా మారాయి. అక్కడి హిందువులపై దాడులు జరగడం వికటించిన స్నేహానికి నిదర్శనం.

పాకిస్తాన్ నుంచి తమ దేశానికి రావడానికి ఉన్న వీసా నిబంధనను కూడా బంగ్లాదేశ్ సడలించింది. దేశ ద్వారాలను బార్లా తెర వడం వల్ల ఉగ్ర మూకలు స్థిర నివాసం ఏర్పరచుకొనే ప్రమాదం ఉంది.

భద్రతాపరంగా ఇది కూడా భారత్‌కు ఆందోళనకరమే. స్వతంత్ర దేశంగాబంగ్లాదేశ్ ఏర్పడటంలో భారత్ పోషించిన పాత్ర చరిత్రాత్మకం. అలాంటి బంధమున్న దేశంతో తగిన విధంగా స్పందించి పరిస్థితులను చక్కబెట్టాలి.

బంగ్లాదేశ్‌లో ఆగస్ట్ మాసంలో జరిగిన రాజకీయ వి పరిణామాల కారణంగా ఆ దేశ ప్రధాని షేక్ హసీనా కట్టుబట్టలతో దేశం నుంచి పారిపోయి భారత్‌లో తలదాచుకొంటున్నారు. అప్పటినుంచీ భారత్, బంగ్లాదేశ్ మధ్య దాదాపు 5 దశాబ్దాల పాటు కొనసాగుతూ వచ్చిన స్నేహ సంబంధాలు ఒక్కసారిగా దెబ్బతిన్నట్లయ్యింది. 1971లో పాకిస్తాన్‌తో యుద్ధం చేసి, స్థానిక ప్రజల ఆకాంక్షల మేరకు ఓ స్వతంత్ర దేశంగా బంగ్లాదేశ్ ఏర్పడటంలో భారత్ పోషించిన పాత్ర చారిత్రాత్మకం.అందుకు భారత్ ఎంతో త్యాగం చేసింది. ఆ తర్వాత కూడా బంగ్లాదేశ్ పునర్ నిర్మాణంలో అన్ని రకాల సహాయ సహకారాలు అందించింది. తమకు స్వేచ్ఛను కల్పించినందుకు బంగ్లాదేశీయులకు సైతం భారత్ పట్ల గౌరవాభిమానాలు నిన్నమొన్నటి వరకు అవిచ్ఛిన్నంగా కొన సాగాయి.

**మారిన పరిస్థితులు**

ఇరు దేశాల మధ్య చక్కటి స్నేహ సంబంధాలు కొనసాగుతున్న తరుణంలో... బంగ్లాదేశ్‌లో చోటు చేసుకున్న పరిణామాలతో పరిస్థి తులు తలకిందులయ్యాయి. 17 కోట్ల జనాభా కలిగిన బంగ్లాదేశ్‌లో దాదాపు కోటిన్నరకు పైగా హిందువులు ఉన్నారు. బౌద్ధులు, క్రైస్తవులు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. గత 4 నెలలుగా బంగ్లా దేశ్‌లోని హిందూ ఆలయాలు, హిందువులను లక్ష్యంగా చేసుకొని దాడులు జరుగుతున్నాయి.

ఆర్థిక రంగంలో నోబెల్ బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పాటైన మధ్యంతర ప్రభుత్వం ఈ దాడులను నిరోధించకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. బంగ్లాదేశ్‌లో చోటు చేసుకొంటున్న పరిణామాలపై విదేశీ (ఇండియా) మీడియా వక్రభాష్యం చెబుతోందంటూ యూనస్ ఈ హింసను సమర్థించుకోవటానికి తాపత్రయపడుతున్నారు.

పొరుగునున్న బంగ్లాదేశ్ ఒక్కసారిగా ప్రత్యర్థిగా మారడాన్ని భారత్ నిశితంగానే పరిశీలిస్తోంది. పార్లమెంట్‌లో అధికార బీజేపీ సభ్యులు ఈ అంశంపై తమ ఆందోళనను వ్యక్తం చేశారు. శ్రీకృష్ణుడి జన్మస్థానమైన మథురకు ప్రాతినిధ్యం వహిస్తున్న సినీ నటి హేమమాలిని హిందువులపై జరుగుతున్న దాడులను ఎత్తి చూపడంతో పాటు, సాధువు చిన్మయి కృష్ణదాస్‌ను అరెస్ట్ చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

ఆశ్చర్యకరంగా, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులతో తమకు సంబంధమే లేనట్టు వ్యవహరిస్తోంది. బంగ్లాదేశ్‌తో 2,216 కిలోమీటర్ల సరిహద్దును పంచుకొంటున్న పశ్చిమ బెంగాల్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న మమతా బెనర్జీ సైతం... ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించడం లేదు.

**ఆ ద్వేషమే భారత్ వ్యతిరేకతకు కారణం**

ప్రధాన ప్రతిపక్షాలన్నీ బహిష్కరించిన జాతీయ ఎన్నికలలో ఈ ఏడాది గెలిచిన షేక్ హసీనా మూడవ పర్యాయం ప్రధానిగా అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత కొన్ని వర్గాల ప్రజల్లో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకొన్నాయి. ప్రజాభిప్రాయాన్ని ప్రతిఫలించని ఆ ఎన్నికలలో హసీనా గెలుపును మెజారిటీ ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని హసీనా, ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న అవామీ లీగ్ పార్టీ ప్రముఖులు పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగానికీ, అవినీతికీ పాల్పడ్డారన్న క్రోధంతో ప్రజలు ఉన్నారు.

పైగా, దేశంలో నిరుద్యోగం పెరుగుతుండగా స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలకు చెందిన వారికి ఉద్యోగాలలో రిజర్వేషన్లుఅందించాలన్న హసీనా ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల కోపం అగ్గి మీద గుగ్గిలం చల్లినట్లయింది. ఒక దశలో దేశాభివృద్ధి రేటులో ఆసియాలోనే అగ్రగామిగా ఉన్న తమ దేశం క్రమంగా హసీనా పరివారం అవినీతి, అసమర్థత కారణంగా పాతాళానికి పడిపోయిందన్న ఆగ్రహమూ ఏర్పడింది. ఈ అంశాలు బంగ్లా 'యువత'ను వీధుల్లోకొచ్చి ఉద్యమించేందుకు పురిగొల్పాయి.

సమస్యల్ని సామరస్యంగా పరిష్కరించకుండా ఉద్యమకారుల్ని అణచివేయడానికి ప్రభుత్వం సిద్ధపడటంతో పరిస్థితి చేయిదాటింది. యువత తిరుగుబాటు చేసి ప్రధాని నివాసాన్ని ముట్టడించి పాల్పడిన విధ్వంసాన్ని యావత్ ప్రపంచం చూసి నివ్వెరపోయింది. సకాలంలో షేక్ హసీనా, ఆమె సోదరి ఇద్దరూ తప్పించుకొని భారత్ చేరుకోవడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు.

షేక్ హసీనాకు ఆశ్రయం ఇచ్చిన భారత్‌ను బంగ్లాదేశీయులు తప్పుపడుతున్నారు. భారత్‌పై వారు గుడ్డి వ్యతిరేకత ప్రదర్శించడానికి అదే కారణమని చెప్పాలి. ఆ వ్యతిరేకత కాస్తా హిందువుల పట్ల ద్వేష భావంగా రూపాంతరంచెందింది. దాంతో ఉద్యమకారులు హసీనా నివాసంపై దాడి చేశాక దేశంలోని హిందువులపైన, హిందువుల ప్రార్థనా మందిరాలపైన విరుచుకుపడి విధ్వంసం సృష్టించారు.

దేశం విడిచిన షేక్ హసీనాకు అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలు ఆశ్రయం ఇవ్వడానికి నిరాకరించగా, భారత్ మాత్రం సాదరంగా ఆహ్వానించి ఆమెకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. హసీనా ప్రభుత్వం స్థానంలో మహమ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వం ఎంతవరకూ వెళ్లిందంటే బంగ్లాదేశ్ జాతి పితగా పిలిచే షేక్ హసీనా తండ్రి ముజీబుర్ రహమాన్ చిహ్నాలను తొలగిస్తోంది.

కరెన్సీ నోట్లపై ఆయన బొమ్మ ఉన్నందున, పాత కరెన్సీని తొలగించి దాని స్థానంలో ఆయన బొమ్మ లేకుండా కొత్త కరెన్సీని మరో 6 నెలల్లో చలామణీలోకి తెస్తోంది. కొత్తగా ముద్రించే కరెన్సీ నోట్ల మీద హసీనాపై చేపట్టిన తిరుగుబాటు చిత్రాలను ముద్రించనున్నట్లుబంగ్లా సెంట్రల్ బ్యాంకు ప్రకటించడం సంచలనం కలిగించింది.

**పాక్‌తో సన్నిహితంగా బంగ్లా**

పాకిస్తాన్ నుంచి తమ దేశానికి రావడానికి ఉన్న వీసా నిబంధనను బంగ్లాదేశ్ సడలించినట్లుగా వార్తలొచ్చాయి. ఇదొక అనూహ్య పరిణామం. ఒకవిధంగా, బంగ్లాదేశ్ తన కన్నును తానే పొడుచు కొన్నట్లు భావించాలి. పాకిస్తాన్‌తో స్నేహ సంబంధాలను నెరపుకోవడాన్ని ఎవ్వరూ తప్పుపట్టరు. కానీ, తమ దేశ ద్వారాలను బార్లా తెరవడం వల్ల ఉగ్రవాద మూకలు దేశంలోకి ప్రవేశించి స్థిర నివాసం ఏర్పరచుకొనే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే బంగ్లాదేశ్, భారత సరిహద్దుల వెంబడి 3 బెటాలియన్ల రక్షణ దళాలను (బీఎస్ఎఫ్) మన ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

నిజానికి గత నాలుగైదు నెలలుగా భారత్ దౌత్యపరంగా అనేక దేశాలకు మరింత చేరువైంది. చైనా అండ చూసుకొని తోక జాడించాలనుకొన్న 'మాల్దీవులు' మళ్లీ తప్పు సరిదిద్దుకొని భారత్‌కు స్నేహహస్తం చాచింది. ప్రధాని నరేంద్ర మోదీ అక్టోబర్ మాసంలో రష్యా, ఆ తర్వాత నైజీరియా, బ్రెజిల్, గయానా దేశాలలో పర్యటించి ఆ దేశాలతో గల ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్ఠం చేశారు. మరోపక్క రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఆఫ్రికా దేశాలలో పర్యటించడం వల్ల ఆ దేశాలతో భారత్ వ్యాపార, వాణిజ్య సంబంధాలు విస్తరించాయన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

నేడు ప్రపంచంలోనే భారత్ ఓ బలీయమైన దేశంగా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పాలస్తీనా-ఇజ్రాయెల్ యుద్ధాలను నిలువరించగలిగిన సామర్థ్యం గల దేశంగా పరిగణించబడుతున్న తరుణంలో చిరకాల మిత్రదేశం బంగ్లాదేశ్‌తో వైరం ఏర్పడటం ఆందోళనకరమే. 142 కోట్ల ప్రజల భద్రతకే కాదు, ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాల్లో ఉన్న భారతీయుల భద్రతకు పూచీ పడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. బంగ్లాదేశ్‌లో ఉన్న లక్షలాది మంది హిందువుల మనుగడ ప్రశ్నార్థకం కాకముందే భారత ప్రభుత్వం తగు విధంగా స్పందించి వారి పూర్తి రక్షణకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

# చర్చ జరగాలి కానీ, ఇలాగా..?



పార్లమెంట్ శీతకాల సమావేశాలు ఈ సోమవారంతో ఆఖరి వారం వ్యవధిలోకి ప్రవేశించాయి. దేశంలో చలి పెరుగుతుంటే, సభలో వాతావరణం మాత్రం వేగంగా వేడెక్కుతోంది. మొన్న నవంబర్ 26న 75 వసంతాలు పూర్తి చేసుకున్న భారత రాజ్యాంగం అమలుపై అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శల పర్వం చూస్తే ఆ భావనే కలుగుతుంది. లోక్‌సభలో గత శుక్ర, శనివారాలు రాజ్యాంగ చర్చ జరిగితే, ఈ సోమ, మంగళవారాలు రాజ్యసభలో అది కొనసాగుతోంది.

'ఒకే దేశం... ఒకే ఎన్నిక' బిల్లుకు కావాల్సిన రాజ్యాంగ సవరణ మాట అటుంచితే, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కాక గాంధీల కుటుంబ శ్రేయానికై కాంగ్రెస్ నిస్సిగ్గుగా రాజ్యాంగాన్ని సవరిస్తూ పోయిందని ఆర్థిక మంత్రి ఆరోపించడం తాజాగా అగ్గి రాజేసింది. అనేక జటిల సమస్యలకు రాజ్యాంగ సవరణలే ఏకైక పరిష్కారం అంటూ నెహ్రూకు సాక్షాత్తూ సర్దార్ పటేలే లేఖ రాశారంటూ రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తిప్పికొట్టాల్సి వచ్చింది. వెరసి, భారత గణతంత్రానికి ఆత్మలాంటి రాజ్యాంగంపై చర్చ పక్కదోవ పట్టి, పార్టీలు బురదజల్లుకొనే ప్రక్రియగా మారిపోయింది.

నిజానికి, స్వాతంత్ర్యానంతరం భారతదేశ భవితవ్యమెలా ఉంటుందన్న దానిపై బోలెడన్ని అనుమానాలు, జోస్యాలు వెలువడినా, మన రాజ్యాంగం పటాపంచలు చేసింది. నిజానికి, నవ యువ గణతంత్ర రాజ్యంగా మనం అనేక ఒడుదొడుకులను ఎదుర్కొన్నాం. వాటన్నిటినీ తట్టుకొని నిలవడంలోనూ విజయవంతమయ్యాం. భారత రాజ్యాంగం కాలపరీక్షకు నిలిచి, దేశానికి మూలస్తంభంగా నిలిచింది.

ఇవాళ అనేక దేశాల్లో, చివరకు సోకాల్డ్ ప్రజాస్వామ్యాల్లోనూ అధికార బదలాయింపులో పలు సమస్యలను ఎదుర్కొంటున్నా, భారత్‌లో మాత్రం ప్రజాభీష్టాన్ని ప్రతిఫలించే అధికార బదలీ శాంతియుతంగా సాగిపోవడం మన రాజ్యాంగం వేసిన పటిష్ఠమైన పునాదికీ, చూపిన ఆచరణాత్మకమైన మార్గానికీ తార్కాణం. ఈ ఏడున్నర దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో వేర్వేరు రాజకీయ పార్టీలు, కూటములు దేశాన్ని పాలించాయి. 1975లో ఎమర్జెన్సీ విధింపు లాంటి అశనిపాతాలు అడపాదడపా ఎదురైనా, ప్రభుత్వాలన్నీ దేశాన్ని ముందుకే నడిపాయి.

క్రియాశీలక సజీవపత్రంగా రాజ్యాంగ రూపకర్తలు సంభావించిన భారత రాజ్యాంగం అంతర్గత సంకల్పబలం, స్థితిస్థాపక చైతన్యంతో నవ భారత అవసరాలకు తగ్గట్టుగా మార్పులతో నిత్య నూతనంగా నిలుస్తూ వచ్చింది. దానికి తగ్గట్టే రాజ్యాంగాన్ని ఇప్పటికి శతాధిక పర్యాయాలు సవరించడం జరిగింది. దేశ సామాజిక, ఆర్థిక ప్రయోజనాలకు తగ్గట్టు దేశం ముందుకు పోయేందుకు అనేక ఏళ్ళుగా భారత రాజ్యాంగం వీలు కల్పిస్తూనే వచ్చింది.

అనేక పార్శ్వాలున్న ఈ రాజ్యాంగ ప్రస్థానాన్ని పార్లమెంట్‌లో చర్చిస్తున్నారంటే, భవిష్యత్తుపై దృష్టి సారిస్తారని భావించాం. రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదర్శాలు, లక్ష్యాలు సాకారమయ్యేందుకు పథనిర్దేశం జరుగుతుందని ఆశించాం. భారత స్వాతంత్ర్య శతవర్ష సమారోహం సాగే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎలా తీర్చిదిద్దాలన్న దానిపై మేధా మథనం జరపాలని ఆకాంక్షించాం. ఆ దిశలో సామాన్యుల జీవితాలు మెరుగయ్యేలా లక్షించాల్సింది పోయి విమర్శల పర్వానికే చర్చ పరిమితమైపోవడం శోచనీయం.

నిజానికి, ఎవరూ విమర్శలకు అతీతులు కారు. గాంధీ, నెహ్రూలైనా అంతే. వారిని విమర్శించ దలుచుకుంటే నేరుగా విమర్శించవచ్చు. అంతేకానీ, రాజ్యాంగంపై చర్చ పేరిట పరోక్షంగా కొంద రిపై బురద జల్లడం ఏమిటన్నది ఒక వాదన. తాజా చర్చ సందర్భంలో అధికార ఎన్డీఏ వర్గీయులు ఉద్దేశపూర్వకంగానే రాజ్యాంగ నిర్మాతల లక్ష్యాలను తప్పుబడుతున్నారని కూడా ఆరోపణ. అయితే, అసలు భావప్రకటనా స్వేచ్ఛపై సహేతుకమైన పరిమితులు పెట్టవచ్చంటూ తొలి రాజ్యాంగ సవరణ తెచ్చింది కాంగ్రెసే అని బీజేపీ ఎత్తిచూపుతోంది.

స్వేచ్ఛ ఉండాలి నిజమే కానీ, అన్ని సమయాల్లోనూ అది నిర్నిబంధమైతే కష్టం గనక సహేతుకమైన పరిమితులు విధించవచ్చని అలా ప్రథమ సవరణతో రాజ్యాంగ రూపకర్తలే దిద్దుబాటు బాట పట్టారన్నది కాంగ్రెస్ వర్గీయుల ప్రతివాదన. రాజ్యాంగ అమలుకు అమృతోత్సవ వేళ చర్చ దాని అమలు తీరుతెన్నులు, భవిష్యత్ సవాళ్ళపైనే సాగాల్సింది. సామూహిక ఆత్మ పరిశీలనకు దీన్ని అవకాశంగా మలుచుకోవాల్సింది. కానీ, జరుగుతున్నది వేరు. చర్చంతా రాజకీయ రంగు పులుముకొని, నెహ్రూ కుటుంబం, ఎమర్జెన్సీ, మోదీ సర్కార్ చుట్టూ సాగుతోంది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో అవిశ్వాస తీర్మానంపై చర్చ ఫక్కీలోకి జారిపోయింది.

1975 ఎమర్జెన్సీలోనైనా, ఇప్పుడు 'అప్రకటిత ఎమర్జెన్సీ' ఉందంటున్నా... రెండు సందర్భాల్లో పాలకుల చేతిలో నలిగిపోయింది రాజ్యాంగానికి గుండె లాంటి పౌరుల ప్రాథమిక హక్కులే అని విస్మరించరాదు. ఏళ్ళు గడుస్తున్నకొద్దీ సవాళ్ళు అధికరిస్తున్నాయి. లౌకికవాదం, సమాఖ్య వాదం, న్యాయవ్యవస్థ స్వతంత్రత, దుర్విచక్షణ లేకపోవడం, మైనారిటీల హక్కుల పరిరక్షణ లాంటి రాజ్యాంగ మౌలిక సూత్రాలపైనే ప్రశ్నార్థకాలు పొడసూపుతున్నాయి.

సమాన అవకాశాల మాట దేవుడెరుగు, ఆర్థికంగా- సామాజికంగా- లింగపరంగా సమానత్వం సైతం నేటికీ పూజ్యం. అంత రాలు పెరుగుతున్న సమాజంలో అసమానతల నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామా? అన్ని పక్షాలూ ఆత్మావలోకనం చేసుకోవాలి. రాజకీయ పత్రం, దేశ రాజకీయాలకు పునాది అయినప్పటికీ, రాజ్యాంగమనేది అదే సమయంలో రాజకీయాలకు అతీతమైనది.

దానిపై చర్చలో ప్రధాని సహా అందరూ సంకుచిత రాజకీయాలకే చోటిస్తే ఇంకేమనాలి? ఈ ధోరణి మారాలి. రాజ్యాంగం ఇన్నేళ్ళుగా జాతికి దిక్సూచిగా నిలిచింది. ప్రభుతకూ, పౌరులకూ ప్రజాస్వామ్య ఫర్మానాగా వెలిగింది. ఆ ఉజ్జ్వల స్ఫూర్తికి కట్టుబడడమే సమస్త సమస్యలకూ పరిష్కారం. సామాన్యుల హక్కులకు శ్రీరామరక్ష.

# కొత్త రెవెన్యూ చట్టంతోనే భూ సమస్యలకు పరిష్కారం

**భూభారతి చట్టాన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాం:వి.లచ్చిరెడ్డి**
**-సీఎంకు, రెవెన్యూ మంత్రికి ధన్యవాదాలు తెలిపిన డీసీఏ, టీజీటీఏ,టీజీఆర్ఎస్ఏ నేతలు**



**హైదరాబాద్, డిసెంబర్18,సిటీ టైమ్స్:** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఆర్వోఆర్ రెవెన్యూ చట్టాన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నట్టుగా డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె. రామకృష్ణ పేర్కొన్నారు. భూభారతి పేరుతో వచ్చిన చట్టంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అసెంబ్లీలో కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని ప్రవేశ పెట్టి ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. చట్ట రూపకల్పనకు విశేష కృషి చేసిన సీసీఎల్ఏ నవీన్ మిట్టల్, భూ చట్టాల నిపుణులు భూమి సునీల్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కొత్త ఆర్వోఆర్ చట్టంలోని అంశాలను వివరించారు. గత చట్టంతో రైతులకు సేవ చేసే అధికారం కింది స్థాయి అధికారులకు లేకుండా పోయిందన్నారు. ఏ చిన్న భూ సమస్య వచ్చిన హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ కార్యాలయం వరకు రావాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ ఇప్పుడు భూమి ఉన్న ప్రతి రైతుకు ఈ చట్టంతో పాస్ పుస్తకాలు వస్తాయన్నారు. ఇప్పుడున్న ధరణి రికార్డును పూర్తిగా ప్రక్షాళన చేసిన తర్వాతనే కొత్త చట్టం కింద నమోదు చేస్తారన్నారు. మ్యుటేషన్‌లో తప్పు జరిగితే అప్పీల్ చేసుకునే అవకాశం ఈ చట్టం కల్పిస్తోందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత వెనువెంటనే మ్యుటేషన్, పాస్ పుస్తకం జారీ అవుతుందన్నారు. వారసత్వ భూములకు నిర్ణిత గడువులోపు విచారణ చేసిన తర్వాతనే పాస్ పుస్తకాల జారీ చేస్తారన్నారు. 13బీ, 38ఈ, ఓఆర్సీ, లావోని భూములకు ఆర్డీఓలకు పాస్ పుస్తకాలు జారీ చేసే అధికారం ఈ చట్టంలో కల్పించారన్నారు. సాదాబైనామా దరఖాస్తులకు క్రమబద్ధీకరణకు ఈ చట్టం పరిష్కారం అవుతాయన్నారు. గ్రామ కంఠం, ఆబాదీలకు కూడా భూమి హక్కుల రికార్డు రాబోతుందన్నారు. మనిషికి ఆధార్ వలె.. భూయజమానులకు భూధార్ ఇవ్వనున్నట్టుగా తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలోనే రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, ప్రత్యేకంగా ట్రిబ్యునళ్ల ఏర్పాటు చేయనున్నట్టుగా చెప్పారు. కొత్త రెవెన్యూ చట్టంతో గ్రామానికో రెవెన్యూ అధికారితో అందుబాటులోకి రెవెన్యూ సేవలు సైతం అందుబాటులోకి వస్తాయన్నారు. సరిహద్దు, డబుల్ రిజిస్ట్రేషన్ వివాదాలు రాకుండా ఉండేందుకు మ్యుటేషన్‌తో పాటు మ్యాప్ కూడా వస్తుందన్నారు. అనుభవదారుడి కాలాన్ని కూడా రికార్డ్ లో ఉండే విధంగా తీసుకురావడం జరుగుతుందన్నారు. దీంతో భూ అనుభవదారుల హక్కుల పరిరక్షణ కూడా కల్పించడం జరుగుతుందని తెలిపారు. గత చట్టంలో ఈ అవకాశం లేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఫూల్‌సింగ్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.



## త్రాగునీరు లేక ప్రభుత్వ ఆసుపత్రి తండ్లాట

**పట్టించుకునే నాధుడు లేక రోగుల పాట్లు.**
**అధికారులు, పాలకులకు కనబడద ప్రభుత్వ ఆసుపత్రి గోస.**
**సమస్యలపై స్పందించే వారెవరంటూ రోగుల ప్రశ్న.**

**పాలకుర్తి, డిసెంబర్ 18 సిటీ టైమ్స్:** లక్షల కోట్ల బడ్జెట్ లక్షణంగా ప్రజల నుంచి వసూలు చేస్తారు. ప్రజలకు ఏం కావాలో పాలకులకు తెలుసు. తెలిసిన చేయరు. చేయడానికి ముందుకు రారు ఇది స్వతంత్ర భారతంలో ప్రభుత్వాల తీరును మనం చూస్తూనే ఉన్నాం. ఆ ప్రభుత్వం సరిగ్గా చేయకపోతే, ఈ ప్రభుత్వాన్ని, ఈ ప్రభుత్వం సరిగ్గా చేయకపోతే ఆ ప్రభుత్వాన్ని మారుస్తూనే ఉంటాం కానీ అన్ని ప్రభుత్వాలది ఒకటే దారి, ప్రజలకు ఏం కావాలో వాటిని దూరం పెడుతూనే ఉంటారు. ప్రజలకు కావాల్సిన కీలకమైన విద్యా, వైద్యం గాలికి వదిలేసి, కొసరును వెంటవేసుకొని అదే కొద్దిగా ఫీల్ అవుతూ భుజాలు చరుచుకుంటారు, ఆ నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యమే పాలకుర్తి ప్రభుత్వ దావకాన దుస్థితి. వివరాల్లోకి వెళితే కనీసం త్రాగటానికి నీళ్లు లేక దావకానలోని రోగులు పడుతున్న అవస్థలు అంతా ఇంతా కాదు, ఇంత ఇబ్బంది పడుతున్న ప్రభుత్వ ఉన్నతాధికారులు గాని గాని, పాలకులు గానీ స్పందించకపోవడం పేదల పట్టా వారికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. ప్రజల పన్నులతో లక్షల కోట్ల బడ్జెట్ను కూడగడుతూ, కీలకమైన ప్రభుత్వ ఆసుపత్రులపై నిర్లక్ష్య వైఖరి ఎందుకో అని, రోగులు ప్రజల ప్రశ్నిస్తూనే ఉన్న చీమకుట్టినట్టైనా కనపడకపోవడం గమనార్హం. ఇకనైనా స్పందించి తక్షణమే తాగునీరు కోసం యుద్ధ ప్రాతిపదిక పైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## నల్లచెరువు కట్ట పట్టణ ప్రజలకు నడక వ్యాయామం చేసుకునేందుకు అణువుగా అభివృద్ధి చేయాలి...

**జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి..**

**వనపర్తి బ్యూరో సిటి టైమ్స్ డిసెంబర్ 18:** వనపర్తి పట్టణంలోని నల్ల చెరువును పట్టణ ప్రజలకు నడక, వ్యాయామం చేసుకునేందుకు వీలుగా అభివృద్ధి చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఉదయం అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, మున్సిపల్ చైర్మన్ పి. మహేష్, మున్సిపల్ అధికారులతో కలిసి నల్ల చెరువును సందర్శించారు. పట్టణ ప్రజలకు, ఉదయం, సాయంత్రం కాలి నడక, వ్యాయామం చేసుకునేవిధంగా కట్టను అభివృద్ధి చేయాలని అందుకు అవసరమైన డి.పి.ఆర్.ను సిద్ధం చేసి ప్రతిపాదనలు ఇవ్వాల్సిందిగా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బ్రిడ్జి పై నుండి భారీ వాహనాలు నడవకుండా గేట్ పెట్టాలని సూచించారు. ప్రజలు నడకతో పాటు వ్యాయామం చేసుకునే విధంగా ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఆట వస్తువులు, రెండు దిక్కుల అందమైన మొక్కలు వంటివి ఆభివృద్ధి చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, మున్సిపల్ చైర్మన్ మహేష్, మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్, వైస్ చైర్మన్ కృష్ణ, మున్సిపల్ డి. ఈ యునస్, ఏ. ఈ తదితరులు కలక్టర్ వెంట ఉన్నారు.





## 2022 23 రబి సీజన్ ధాన్యానికి వేలం వేసిన డబ్బులను మిల్లర్ లు వెంటనే చెల్లించాలి...

**జిల్లా కలెక్టర్ ఆదర్శ సురబి..**



**వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ డిసెంబర్ 18:** 202223 రబీ సీజన్ వేలం వేసిన ధాన్యానికి సంబంధించి మిల్లర్లు వెంటనే డబ్బులు చెల్లించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 202223 రబీ సీజన్ వేలం వేసిన ధాన్యానికి సంబంధించి మిల్లర్లు వెంటనే డబ్బులు చెల్లించాలని ఆదేశించారు. ఈ విషయంలో రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ విషయంలో సహకరించిన మిల్లర్లకే రాబోయే రోజుల్లో ధాన్యం ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కటుంబానికి ఆర్థిక సాయం చేసిన యువ నాయకుడు ఎర్వ సాయి ప్రసాద్ యాదవ్

**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ డిసెంబర్ 18:** వనపర్తి మండలం కాశింనగర్ ఎర్రగట్టు తాండకీ చెందిన మూడవత్ రాములు బుధవారం అనారోగ్యం తో మృతి చెందారు. ఇట్టి విషయాన్నీ గ్రామ యువకులు హనుమంతు నాయక్, నీలేష్ నాయక్,గోపాల్ నాయక్, రాము నాయక్, గోపాల్ నాయక్ మరియు గ్రామస్తులు వనపర్తి జిల్లా యువ నాయకుడు ఎర్వ సాయి ప్రసాద్ యాదవ్ తెలుపడంతో వెంటనే స్పందించిన సాయి ప్రసాద్ యాదవ్ 5,000/ రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులు యువ నేత సాయి ప్రసాద్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు.



# పెద్దమందడి ఆధార్ సెంటరా..! మజాకా...?

**ప్రజలకు అందుబాటులో లేని ఆధార్ సెంటర్ అవసరమా...?**
**తాసిల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న అధికారుల పర్యవేక్షణ కరువు...!**
**ప్రతిరోజు ఆధార్ సెంటర్ కు వచ్చి ఆకలి మంటతో వెను తిరుగుతున్న పెద్దమందడి మండల ప్రజలు...**






**పెద్దమందడి సిటి టైమ్స్ డిసెంబర్ 18:** ప్రభుత్వం ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రతి మండలంలో ఒక ఆధార్ సెంటర్ ను ఏర్పాటు చేసింది... కానీ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా పెద్దమందడి మండల కేంద్రంలోని విరాట్ ఆధార్ సెంటర్ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండల ప్రజలు విద్యార్థులు రైతులు మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.. ప్రభుత్వం నిర్మించిన భవనాన్ని ఆధార్ సెంటర్ కు ఇచ్చారు.. అధికారుల పర్యవేక్షణ ఉంటుందని తాసిల్దార్ ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలోనే ఆధార్ సెంటర్ ను ఏర్పాటు చేసినప్పటికీ ఇక్కడ అధికారులు నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది ఆధార్ సెంటర్ నిర్వాహన పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పాటు సమయపాలన విషయంలో అధికారులు ఆధార్ సెంటర్ నివాకునికి ఆదేశాలు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.. బుధవారం మధ్యాహ్నం 12:30 గంటలు అయినా తాసిల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న విరాట్ ఆధార్ సెంటర్ తాళం వేసుకొని ఉండడంతో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఆధార్ సెంటర్ కు వచ్చి సెంటర్ నిర్వాహకుని కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.. ప్రతిరోజు ఇలాగే ఉంటుందని అక్కడికి వచ్చిన ప్రజలు తెలిపారు.. పెద్దమందడి మండల కేంద్రమైనప్పటికీ అక్కడ సరైన సౌకర్యాలు భోజన వసతి కూడా లేకపోవడంతో ఆధార్ సెంటర్ నిర్వహి కోసం మధ్యాహ్నం రెండు గంటల వరకు వడిగాపులు కాసి చేసేదేమీ లేక ఆకలి మంటతో గ్రామాలకు వెళ్తామని అక్కడికి వచ్చిన జనాలు తెలిపారు ఇప్పటికైనా జిల్లా కలెక్టర్. ఆధార్ మరియు మీ సేవ కేంద్రాల బాధ్యతలు చేసే జాయింట్ కలెక్టర్ చర్యలు తీసుకొని ప్రజలకు అందుబాటులో ఆధార్ సెంటర్ సేవలు ఉండే విధంగా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



## పాలకుర్తిలో దొంగల బీభత్సం..!

**పాలకుర్తి, డిసెంబర్ 18, సిటీ టైమ్స్:** పోతన కాలేజీ సమీపంలో చరగొండ్ల మల్లయ్య కాలనీలో బోడ లలిత వారి ఇంట్లో తాళం గడ్డపారతో ఇంటినిపగలగొట్టి ఇంట్లోకి చొరబడి. 20 తులాల బంగారం 50 వేల రూపాయల నగదు ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని దుండగులు.. ఆ ఇంటి యజమాని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని (క్లూజ్ టీం, డాగ్స్ స్కాడ్ రంగంలోకి దింపి,) దర్యాప్తు చేస్తున్న సిఐ గట్ల మహేందర్ రెడ్డి. తనదైన శైలిలో విచారణ చేపట్టిన ఎస్సై దూలం పవన్ కుమార్ పోలీస్ బృందం..

## అలన్న ను కలిసిన కొన్నూరు బి ఆర్ ఎస్ యువ నాయకుడు నాయిని రాము



**మదనాపురం సిటీ టైమ్స్ డిసెంబర్ 18:** దేవరకద్ర నియోజకవర్గంలో నేడు కౌకుంట్ల మండల కేంద్రంలో బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తల సమ్మేళనలో అలన్న ను కొన్నూరు గ్రామానికి చెందిన నాయిని రాముకలవడం జరిగింది. ఈ మధ్య కాలంలో రాము పై అక్రమంగా కేసులు పెట్టిన దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి వాట్సాప్ లో పోస్టులు పెట్టినందుకు రాము పై పోలీస్ లు కేసు నమోదు చేయడం జరిగింది. మా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి రాముకు మనోధైర్యాని ఇచ్చాడు. ఎటువంటి కేసులకు భయపడవద్దు అని చెప్పడం జరిగింది.

## వనపర్తి డిగ్రీ కళాశాల 50 సంవత్సరాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ డిసెంబర్ 18 :** ఈనెల 22 వ తేదీ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ ఉత్సవాలకు కాలేజీలో చదివి ఐఏఎస్ ఐపీఎస్ అయిన వారు ఆహ్వానితులు హాజరవుతారు అలాగే సాయంత్రం ఎంపీ మల్లు రవి , ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, పూర్వపు అధ్యాపకులు, నాన్ టీచింగ్ అధ్యాపకులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. కనుక 1974 నుండి 2024 వరకు పూర్వపు విద్యార్థిని, విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులు అందరూ సకాలంలో పాల్గొనాలని పత్రికా ముఖంగా ఆహ్వానిస్తున్నాము. స్థలం: డిగ్రీ కళాశాల భవనం గోపాల్పేట రోడ్డు నర్సింగాయపల్లె శివారు. కళాశాల ప్రిన్సిపాల్, స్వర్ణోత్సవ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, అలుమిని కమిటీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, మరియు ఆహ్వాన కమిటీ అధ్యక్షులు సతీష్ యాదవ్.



## చిన్న రాజమూరు ఆంజనేయస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

**ఆలన్నకు స్వాగతం పలికిన ఆలయ అర్చకులు బి ఆర్ ఎస్ నాయకులు**

**దేవరకద్ర సిటీ టైమ్స్ డిసెంబర్ 18:** దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి బ్రంమోత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ యాదవ్, జెట్టి నర్సింహా రెడ్డి, కొండారెడ్డి, నరేందర్ రెడ్డి,చెల్మా రెడ్డి, యుగంధర్ రెడ్డి,ఉప్పరి సత్యం చిన్న రాజమూరు బిఆర్ఎస్ నాయకులు వై. గోవర్ధన్, శ్రీనివాసులు, ఆంజనేయులు, సాయిరాం, గోవర్ధన్, రాఘవలు, సుభాష్, నవీన్,బత్తుల ఆంజనేయులు, సంజప్ప ఆంజనేయులు, హెచ్, బాలప్ప, సాయిలు, కావాలి హన్మంతు, శ్రీను, వెంకటయ్య, వడ్ల నారాయణ,కుమ్మరి నర్సింహా, నాగరాజు, శేఖర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## చెరుకు ట్రాక్టర్లను జాగ్రత్త గా నడపాలి

**సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు :ఎస్సై శేఖర్ రెడ్డి**

**మదనాపురం సిటీ టైమ్స్ డిసెంబర్ 18:** వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా నడపాలని చెరుకు ట్రాక్టర్ల డ్రైవర్లకు ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు. మదనాపురం మండల కేంద్రంలో బుధవారం నాడు అవగాహన కల్పించి మాట్లాడారు.ఖచ్చితంగా సమయ పాలన పాటించాలని వివరించారు.ఎదురుగా వస్తున్న వాహన దారులకు ఎలాంటి ఇబ్బంది కలిగించిన ట్రాక్టర్లను ఎడా పెడాగా నడిపిన చర్యలు తప్పవని సూచించారు.రోడ్ల పక్కల ఉన్న పెద్ద పెద్ద చెట్ల కొమ్మల తాకిడి వల్ల వాహనాన్ని కుడివైపుకు తీసుకునేటప్పుడు వెనక వస్తున్న వాహనాలను గమనించి నడపాలని, అతి వేగంతో ఉండి డస్ట్ రోడ్ల దగ్గర గుంతలు చేస్తూ ఇతరులకు ప్రమాదాలను కలిగించవద్దన్నారు.ముఖ్యంగా సాయంత్రం సమయాన విచ్చల విడిగా చెరుకు ట్రాక్టర్లు తిరగడంతో ఎంతో మంది అయోమయానికి గురై డ్రైవింగ్ లో ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం ఉందన్నారు.అందుకు రాత్రి పూట ఒక సమయ స్ఫూర్తిని ఎంచుకొని చెరుకుని తీసుకెళ్లాలని సూచించారు.గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగిన సంఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని వెల్లడించారు.అవగాహన కల్పించి వారిలో ఎస్సై శేఖర్ రెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.





## చేయూత చిల్డ్రన్ హోమ్ ను సందర్శించిన అదనపు జేసి..



**వనపర్తి కలెక్టరేట్ సిటి టైమ్స్ డిసెంబర్ 18:** బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ గారు సంచిత్ గంగ్వార్ చేయూత చిల్డ్రన్ హోమ్ నోను సందర్శచారు అక్కడ వసతి పొందుతున్న విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, విద్య ,మౌలిక సదుపాయాల గురించి తెలుసుకున్నారు దానితోపాటు అక్కడ ఉన్నా వంటగదిని, బాత్రూమ్స్ ను, పిల్లలు నివాసం ఉంటున్న గదిని, బెడ్ షీట్ ని పరిశీలించడం జరిగింది . ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం రాంబాబు , పివైసి యాదమ్మ, ఓం నిర్వాకులు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.







# లేఅవుట్ల అనుమతి పొందడానికి ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరి...

జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**వనపర్తి బ్యూరో సిటి టైమ్స్ డిసెంబర్ 18:** లేఅవుట్ లకు అనుమతులు పొందడానికి ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ అన్నారు. బుధవారం ఆత్మకూరు మండల పరిధి భార్గవి నగర్ విశ్వ భారతి స్కూల్ సమీపంలో వేసిన లేఔట్ ను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. అనుమతుల కోసం సదరు లే అవుట్ యజమానులు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయికి వెళ్లి ముందస్తు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లే అవుట్ లోని హద్దులను, ఇతర నిబంధనలను పాటించారా లేదా అని పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ లేఅవుట్ లకు అనుమతులు పొందడానికి ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం ఆత్మకూరు మండల పరిధిలోని మూలమళ్ళ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల యాప్ సర్వే



ప్రక్రియను పరిశీలించారు. సర్వేయర్లు వేగంగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. సర్వేలో వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని సూచించారు.

**విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి**

ఆత్మకూరు లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కేజీబీవీ లోని కిచెన్, వంట సామాగ్రి భద్రపరిచే గదులను తనిఖీ చేశారు. వంట సామాగ్రి స్టాక్ కు సంబంధించిన రిజిస్టర్ లను చెక్ చేశారు. స్టాక్ వచ్చినప్పుడు మెస్ కమిటీ విద్యార్థులు సంతకం చేస్తున్నారా అని ప్రశ్నించారు. స్టాక్ వచ్చినప్పుడు విద్యార్థుల సమక్షంలోనే దించుకోవాలని సూచించారు. వంట సామాగ్రి నాణ్యత, ఎక్స్పైరీ డేట్ పని సరిగా చెక్ చేయాలని చెప్పారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు భోజనం వడ్డించే ముందు సూపర్వైజర్లు తిని రుచి చూడాలని, ఆ తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని చెప్పారు.రోడ్లు భవనాల శాఖ డిఈ సీతారామస్వామి, నీటిపారుదల శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, తాసిల్దార్ చాంద్ పాషా, మున్సిపల్ కమిషనర్ శశిధర్ , తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## రైల్వే కొత్త రూల్.. ఒరిజినల్ ఐడీ లేకుండా రైలెక్కితే..



దేశంలో అత్యధిక మంది ప్రయాణించే రవాణా సాధనం రైల్వేలు. రోజూ వేలాది రైళ్లు లక్షలాది మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేరుస్తున్నాయి. కాగా కన్ఫర్మ్‌డ్ టిక్కెట్లతో ప్రయాణించే వారికి, ముఖ్యంగా ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకునే వారికి ఇండియన్ భారతీయ రైల్వే కొత్త ఆదేశాన్ని జారీ చేసింది.

**ఒరిజినల్ ఐడీ ప్రూఫ్ తప్పనిసరి**

మీరు ఆన్‌లైన్‌లో టిక్కెట్‌లను (ఈటికెట్లు) బుక్ చేసుకుంటే ప్రయాణ సమయంలో ఒరిజినల్ ఐడీ ప్రూఫ్‌ని తప్పనిసరిగా తీసుకెళ్లాలి. ఒరిజినల్ ఐడీ లేకుండా రైలెక్కితే టిక్కెట్ తనిఖీ చేసే టీటీఈ మిమ్మల్ని టిక్కెట్టు లేని ప్రయాణికుడిగా పరిగణించి జరిమానా విధించవచ్చు. మీ టిక్కెట్‌ను రద్దు చేసి, రైలు నుండి మిమ్మల్ని దించేయవచ్చు.

**అంగీకరించే ఐడీ ప్రూఫ్‌లు ఇవే..**

- ఆధార్ కార్డ్
- పాస్‌పోర్ట్
- ఓటరు గుర్తింపు కార్డు
- డ్రైవింగ్ లైసెన్స్
- పాన్ కార్డ్
- ఫోటోతో ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఇతర ఐడీ
- ఈ ఒరిజినల్ ఐడీ ప్రూఫ్‌లలో ఏదో ఒకదానిని ప్రయాణికులు తమ వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది. రైల్వేలు ప్రత్యేకంగా అనుమతిస్తే తప్ప ఫోటోకాపీలు లేదా డిజిటల్ ఐడీలను అంగీకరించరు.

**ఒరిజినల్ ఐడీ లేకపోతే ఏమౌంది?**

మీ వద్ద ఒరిజినల్ ఐడీ ప్రూఫ్ లేకపోతే మీ ఈటికెట్ చెల్లనిదిగా పరిగణించి టీటీఈ జరిమానా విధిస్తారు. మీకు కన్ఫర్మ్ అయిన సీటును రద్దు చేయవచ్చు. విధించే జరిమానాలు ఏసీ తరగతులకైతే టిక్కెట్ ధరతో పాటు రూ.440, అదే స్లీపర్ క్లాస్ అయితే టిక్కెట్ ధరతో పాటు రూ.220 ఉంటుంది. జరిమానా కట్టినా కూడా మళ్లీ మీకు కేటాయింపు ఉండదు.

# 33.33% ప్రీమియంతో విశాల్ మెగామార్ట్ లిస్టింగ్..

## అదరగొట్టిన మొబిక్విక్

దేశవ్యాప్తంగా సూపర్‌మార్ట్‌లను నిర్వహిస్తున్న విశాల్ మెగామార్ట్ తొలి పబ్లిక్ ఇష్యూ ఈరోజు దలాల్ స్ట్రీట్‌లో ఎంట్రీ ఇచ్చింది. మదుపర్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఐపీఓ షేర్లు నేడు మార్కెట్లో నమోదయ్యాయి. ఎన్ఎస్ఈలో రూ.104 వద్ద షేర్లు ప్రారంభమయ్యాయి. అంటే ఇష్యూ ధర రూ.78తో పోలిస్తే 33.33 శాతం ప్రీమియంతో లిస్ట్ అయ్యాయి. రూ.8 వేల కోట్లు సమీకరణే లక్ష్యంగా విశాల్ మెగా మార్ట్ తొలి పబ్లిక్ ఇష్యూకు కు వచ్చింది. ధరల శ్రేణిని రూ.7478గా నిర్ణయించింది. ఈ ఐపీఓ పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో నిర్వహించింది. సబ్‌స్క్రిప్షన్ మొదలైన తొలిరోజు నుంచే మంచి స్పందనతో దూసుకెళ్లింది. చివరిరోజున 28 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. అత్యధికంగా క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్ల కోటా 85.11 రెట్ల సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కోటా 15 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 2.43 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి ఈ కంపెనీ రూ.2400 కోట్లు సమీకరించింది.

**అదరగొట్టిన మొబిక్విక్**

ఫిన్‌టెక్ సంస్థ వన్ మొబిక్విక్ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. రూ.442.25 వద్ద స్టాక్ మార్కెట్లో ఎంట్రీ ఇచ్చాయి. అంటే లిస్టింగ్ ధర రూ.279తో పోలిస్తే ఏకంగా 58.51శాతం ప్రీమియంతో దూసుకెళ్లాయి. మొబిక్విక్ సబ్‌స్క్రిప్షన్ తొలిరోజే అనూహ్య ఆదరణ సంపాదించుకుంది. తొలి గంటలోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఇక చివరిరోజు ఏకంగా 119.38 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఐపీఓలో భాగంగా మొత్తం 1.18 కోట్ల షేర్లు (1,18,71,696) జారీ చేయాలని నిర్ణయించుకుంది. రూ.572 కోట్ల ఐపీఓలో భాగంగా ధరల శ్రేణిని కంపెనీ రూ.265 279గా నిర్ణయించింది.




# బీమా పాలసీతో ఆరోగ్యం కొనుక్కోవచ్చు!

ఆరోగ్యం, సంపద... ఏ మనిషి జీవితంలోనైనా ప్రధాన పాత్ర పోషించే అంశాలివి. ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం సరిగా లేకపోతే... ఏమీ ప్రయోజనం ఉండదు. అదే... సంపద లేకపోయినా ఆరోగ్యం బాగుంటే చాలు... ఎలాగైనా సంపాదించుకోవచ్చు. కాబట్టి ఆరోగ్యం అత్యంత ప్రధానం అన్న విషయం దీన్నిబట్టి మనకు స్పష్టంగా తెలుస్తోంది. ఇవాళ్టి రోజుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అంత తేలిక్కాదు. కోవిడ్ మన జీవితాల్ని ఎంత ప్రభావితం చేసిందో ఎరుకే.. అదీగాక... మారిన కాలమాన పరిస్థితుల్లో... ఎప్పుడు ఎలాంటి రోగాలు పుట్టుకొస్తాయి ఎవ్వరం చెప్పలేం. అప్పటిదాకా ఎంతో హాయిగా.. ఎలాంటి చీకూ చింతా లేకుండా సాగిపోతున్న జీవితాల్లో ఒక్క అనారోగ్యం వాళ్ళ ఆర్థిక పరిస్థితుల్ని తల్లకిందులు చేసేస్తోంది. అప్పటికప్పుడు హాస్పిటల్లో జాయిన్ చేయాల్సి వస్తే... లక్షలు సిద్ధం చేసుకోవాల్సిందే.. చూస్తూ చూస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడలేం కదా... అంచేత అప్పో సొప్పో చేసి అయినా వైద్యం చేయిస్తాం.

పల్లెలు పట్టణాలుగా, పట్నాలు నగరాలుగా మారిపోతూ ట్రాఫిక్ విచ్చలవిడిగా పెరిగిపోయి.. ఎప్పుడు ఏ ఆక్సిడెంట్ అవుతుందో... బయటకు వెళ్లిన మనిషి సురక్షితంగా వస్తాడో రాడో అంతుచిక్కని రోజులివి. ఇలా ఆకస్మికంగా తలెత్తే అనివార్య ఖర్చుల్ని తలెత్తుకోవడం అందరికీ సాధ్యం కాదు. ఇలాంటప్పుడే... మన చేతిలో ఆరోగ్య బీమా కార్డు ఉంటే... కొండంత ధైర్యాన్ని చేతిలో పెట్టుకున్నట్లే. పైగా నేటి రోజుల్లో కుటుంబానికంతటికీ జీవిత బీమా తో పాటు, ఆరోగ్య బీమా ఉండటం అత్యవసరంగా మారిపోయింది. ఈనేపథ్యంలో ఆరోగ్య బీమా స్థితిగతులను ఓసారి పరిశీలిద్దాం.



**మనదేశంలో ఆరోగ్య బీమాను అందించే ప్రముఖ కంపెనీలు ఇవి.**

**స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్**
**కేర్ హెల్త్ ఇన్సూరెన్స్**
**హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్**
**నివా భూపా హెల్త్ ఇన్సూరెన్స్**
**ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్**
**మణిపాల్ సిగ్న హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ**
**అకో జనరల్ ఇన్సూరెన్స్**
**టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్**

- వైద్యం ఖరీదైన అంశంగా మారిపోయిన ఈరోజుల్లో మీరు తీసుకునే ఆరోగ్య బీమా పాలసీ మిమ్మల్ని వైద్య ఖర్చులనుంచి గట్టెక్కిస్తుంది.
- కనీసం రూ. 2 లక్షల నుంచి రూ. 2 కోట్ల వరకు పాలసీ తీసుకోవచ్చు.
- వయోపరిమితిని బట్టి ప్రీమియం రేట్లు ఉంటాయి. చిన్న వయసులో తక్కువ ప్రీమియంకే పెద్ద పాలసీ తీసుకోవచ్చు.
- ఏదైనా ఒక రోగంతో హాస్పిటల్ పాలైనప్పుడు ఆ వైద్యానికయ్యే ఖర్చుల్ని మనం ఎలాంటి నగదు చెల్లించనక్కర్లేకుండా పొందవచ్చు. మనం పాలసీ తీసుకునే ముందు కొన్ని అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి.
- వీటిలో అత్యంత ప్రధానమైంది మనం బీమా తీసుకునే సంస్థ ఏయే హాస్పిటల్స్ తో అనుసంధానం అయివుందో తెలుసుకోవడం.అంటే దేశవ్యాప్తంగా ప్రముఖ హాస్పిటల్స్ తో పాటు, స్థానిక హాస్పిటల్స్ లో కూడా వైద్యం చేయించుకోవడానికి వీలుగా కవరేజ్ కలిగి ఉండాలి.
- ఒక రోగానికి సంబంధించి హాస్పిటల్ లో జాయిన్ కావడానికి ముందు 30 రోజులు, డిశ్చార్జ్ అయ్యాక 30 రోజుల పాటు వైద్య ఖర్చులు పొందే సౌలభ్యాన్ని వివిధ బీమా సంస్థలు కల్పిస్తున్నాయి. పాలసీ తీసుకునే ముందు వాటి వివరాలు తెలుసుకోవాలి.
- మనం తీసుకునే పాలసీ కి చెల్లించే ప్రీమియానికి కొంచెం అదనంగా చెల్లించడం ద్వారా పర్సనల్ ఆక్సిడెంట్ కవర్, క్రిటికల్ ఇల్నెస్ కవర్ వంటి వాటిని కూడా ఎంచుకోవాలి.
- యాక్సిడెంట్ అయ్యి... ప్రాణాపాయం తప్పి శాశ్వత అంగ వైకల్యానికి లోనైతే... అడిషనల్ రైడర్స్ తీసుకోవడం వల్ల పెన్షన్ మాదిరి నెలనెలా (మన సమ్ అష్యురెడ్ ని బట్టి) సొమ్ములు పొందవచ్చు. సాధారణంగా వృద్ధాప్యానికి మరోపేరే అనారోగ్యం. కాబట్టి కచ్చితంగా ఆరోగ్య బీమా ఉండి తీరాల్సిందే. ఇప్పుడు వయోపరిమితితో సంబంధం లేకుండా.. ఎంత వయసువారైనా బీమా పాలసీ లు తీసుకోవడానికి ఐఆర్డీఏ వెసులుబాటు కల్పించింది. ఇది సీనియర్ సిటిజెన్లకు వరమనే చెప్పాలి.
- అలాగే ఒకే ప్రీమియం తో మొత్తం కుటుంబానికి ఆరోగ్య బీమా రక్షణ కల్పించే విధంగా పాలసీలు అందుబాటులో ఉన్నాయి.
- పాలసీ తీసుకునే టైం కే రోగాలు ఉన్నా కూడా వాటిని కవర్ చేస్తూ బీమా సదుపాయాన్ని పొందే అవకాశం కూడా ఉంది. అయితే వెయిటింగ్ పీరియడ్ ఉంటుంది. పాలసీ తీసుకునే సమయంలో ఏయే బీమా సంస్థలు ఎంతెంత వెయిటింగ్ పీరియడ్ ను పేర్కొంటున్నాయో తెలుసుకోవాలి.
- ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80డ్ కింద మనం కట్టే ప్రీమియానికి (షరతులకు లోబడి) రూ. 25,000 నుంచి రూ.75,000 వరకు పన్ను మినహాయింపు పొందవచ్చు.
- సాధారణంగా 24 గంటలు హాస్పిటల్ లో ట్రీట్మెంట్ తీసుకుంటేనే పాలసీ వర్తిస్తుంది. ఇప్పుడు కొన్ని సంస్థలు అవుట్ పేషెంట్ గా చేయించుకునే వైద్యానికయ్యే ఖర్చులను కూడా బీమా కవరేజ్ లోకి తీసుకుంటున్నాయి. అంతేకాదు... ప్రత్యేకించి ఓపీ చికిత్సల కోసమే ఉపయోగపడే విధంగా పాలసీలు అందుబాటులోకి వచ్చాయి.
- ఎలాంటి ఆరోగ్య సేవలు పొందవచ్చు, ప్రీమియంలు ఎలా ఉంటాయి ఇత్యాది అంశాలను మరోసారి చర్చించుకుందాం.

## 6,000mAh బ్యాటరీతో రియల్‌మీ 14ఎక్స్.. ధర ఎంతంటే?

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీ మరో కొత్త మొబైల్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. రియల్‌మీ 14ఎక్స్ పేరిట లాంచ్ చేసింది. IP69 రేటింగ్, 50ఎంపీ ట్రిపుల్ రియర్ కెమెరాతో దీన్ని తీసుకొచ్చింది. రియల్‌మీ కొత్త మొబైల్ రెండు వేరియంట్లలో లభిస్తుంది. 6 జీబీ+128 జీబీ వేరియంట్ ధర రూ.14,999 కాగా.. 8 జీబీ+128 జీబీ వేరియంట్ ధర రూ.15,999 గా కంపెనీ నిర్ణయించింది. రియల్‌మీ అధికారిక వెబ్‌సైట్, ఫ్లిప్‌కార్ట్ ప్లాట్‌ఫామ్‌తో పాటు రిటైల్ దుకాణాల ద్వారా కొనుగోలు చేయొచ్చు. రియల్‌మీ 14ఎక్స్.. 6.67 అంగుళాల హెచ్‌డీ+ ఐపీఎస్ ఎల్‌సీడీ డిస్‌ప్లేతో వస్తోంది. 120Hz రిఫ్రెష్ రేటు, 625 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌ను ఇస్తుంది. ఇందులో మీడియాటెక్ డైమెన్సిటీ 6300 5జీ ప్రాసెసర్ అమర్చారు. 6,000mAh బ్యాటరీ, 45W ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. కెమెరాల విషయానికొస్తే.. 50ఎంపీ రియర్ కెమెరా, 8ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. ఆండ్రాయిడ్ 14 ఆధారిత రియల్‌మీ యూఐ 5.0తో దీన్ని తీసుకొచ్చారు. రెడ్, క్రిస్టల్ బ్లాక్, గోల్డెన్ గ్లో రంగుల్లో లభిస్తుంది. ప్రారంభ ఆఫర్‌లో భాగంగా రూ.వెయ్యి డిస్కౌంట్, ఆరు నెలల పాటు నోకాస్ట్ ఈఎంఐ సదుపాయం కల్పిస్తోంది. దీంతో పాటు రూ.1049 విలువైన ఏడాది వారెంటీని ఉచితంగా అందిస్తోంది.





# వదలని వరుణుడు..
# గబ్బా టెస్టు మ్యాచ్ డ్రా

## వర్షం కారణంగా ఆట సాధ్యపడకపోవడంతో అంపైర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు.

అనుకొన్నదే అయింది. భారత్ పోరాటానికి వరుణుడు సహకరించాడు. చివరి రెండు సెషన్లలో టీమ్ఇండియాను ఆలౌట్ చేసి విజయం సాధించాలని ఆస్ట్రేలియా భావించింది. అందుకు తగినట్లుగానే వేగంగా ఆడింది. భారత్ ఎదుట 275 పరుగులను లక్ష్యంగా నిర్దేశించింది. టార్గెట్‌ను ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత్ 8/0 స్కోరుతో ఉన్నప్పుడు వర్షం వచ్చేసింది. ఎంతకీ తగ్గకపోవడంతో మ్యాచ్‌ను ముగిస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో గబ్బా వేదికగా టెస్టు మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 445 పరుగులకు ఆలౌట్ కాగా.. భారత్ 260 పరుగులే చేయగలిగింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 89/7 స్కోరుతో డిక్లేర్డ్ చేసింది. ఐదు టెస్టుల సిరీస్‌లో చెరొక విజయంతో, సిరీస్ 11తో సమంగా నిలిచాయి. నాలుగో టెస్టు మ్యాచ్ మెల్‌బోర్న్ వేదికగా డిసెంబర్ 26 నుంచి (బాక్సింగ్ టెస్టు) ప్రారంభం కానుంది.

**వేగంగా ఆడేసిన ఆసీస్**

వర్షం వల్ల తొలి సెషన్‌లో దాదాపు గంటన్నర ఆట సాధ్యపడలేదు. దీంతో రెండో సెషన్‌ను ప్రారంభించిన ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆడేయడం ప్రారంభించింది. సాధ్యమైనంత ఎక్కువగా పరుగులు చేయాలనే ఉద్దేశంతోనే వచ్చిన బ్యాటర్ వచ్చినట్లు వేగంగా ఆడాడు. కానీ, భారత బౌలర్ల దెబ్బకు వారి ప్రణాళికలు పటాపంచలు అయ్యాయి. ఎవరినీ కుదురుకోనీయకుండా బుమ్రా బౌలింగ్ దళం పెవిలియన్‌కు చేర్చింది. ఆఖర్లో ట్రావిస్ హెడ్ (17), అలెక్స్ కేరీ (20*), పాట్ కమిన్స్ (22) భారీ షాట్లకు దిగారు. కమిన్స్ ఔటైన వెంటనే ఆసీస్ తన ఇన్నింగ్స్‌ను 89/7 స్కోరు వద్ద డిక్లేర్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ట్రావిస్ హెడ్ నిలిచాడు. అయితే, గజ్జల్లో గాయంతో ఇబ్బంది పడినట్లు మ్యాచ్ అనంతరం వెల్లడించాడు. అయితే, మెల్‌బోర్న్ టెస్టుకు అందుబాటులో ఉండేందుకు ప్రయత్నిస్తానని వెల్లడించాడు.





# టాప్‌లోనే జస్‌ప్రీత్ బుమ్రా..
## అశ్విన్ స్థానం ఎక్కడంటే?


ఐసీసీ ర్యాంకుల్లో భారత్, ఇంగ్లండ్ ఆటగాళ్ల హవా కొనసాగుతోంది. బౌలింగ్‌లో టీమ్ఇండియా స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా తన అగ్రస్థానాన్ని అట్టిపెట్టుకున్నాడు. ప్రస్తుతం బుమ్రా 890 పాయింట్లతో తొలి ర్యాంక్‌లో ఉండగా.. కగిసో రబాడ 856 పాయింట్లకే పరిమితమయ్యాడు. తాజాగా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రవిచంద్రన్ అశ్విన్ (797 పాయింట్లు) ఐదో స్థానంలో ఉన్నాడు. ఆసీస్‌తో అడిలైడ్ టెస్టులో మాత్రమే అతడు ఆడిన సంగతి తెలిసిందే. వీరిద్దరు కాకుండా రవీంద్ర జడేజా (786) భారత్ తరపున టాప్10లో ఉన్నారు.

**బ్రూక్‌ను వెనక్కి నెట్టిన జో రూట్**

ఐసీసీ టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో జో రూట్ మళ్లీ అగ్రస్థానానికి చేరుకున్నాడు. న్యూజిలాండ్‌తో మూడో టెస్టులో ఇంగ్లండ్ ఓడినప్పటికీ.. రూట్ మాత్రం నాణ్యమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. దీంతో సహచరుడు హ్యారీ బ్రూక్ (876)ను వెనక్కినెట్టి (895) టాప్‌లోకి దూసుకెళ్లాడు. టాప్10లో భారత్ నుంచి యశస్వి జైస్వాల్ (811), రిషభ్ పంత్ (724) మాత్రమే ఉన్నారు.

**జడ్డూనే టాప్**

టెస్టు ఫార్మాట్ ఆల్‌రౌండర్ల జాబితాలో భారత ఆటగాళ్లు రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, అక్షర్ పటేల్ టాప్ 10లో చోటు దక్కించుకున్నారు. జడేజా (415) టాప్‌లో ఉండగా.. అశ్విన్ (283) మూడో స్థానం, అక్షర్ పటేల్ (234) పదో స్థానంలో నిలిచారు. టీ20 బ్యాటింగ్ లిస్ట్‌లో ట్రావిస్ హెడ్ (855), ఫిల్ సాల్ట్ (829), తిలక్ వర్మ (806), సూర్యకుమార్ యాదవ్ (788), జోస్ బట్లర్ (717) టాప్ 5లో కొనసాగుతున్నారు. బౌలింగ్ ర్యాంకుల్లో విండీస్ ఆటగాడు అకీల్ హుసేన్ (707) మూడు స్థానాలను ఎగబాకి అగ్రస్థానంలోకి వచ్చాడు. భారత్ నుంచి ఆరో స్థానంలో రవి బిష్ణోయ్ (666), ఎనిమిదో స్థానంలో అర్షదీప్ సింగ్ (656) చోటు దక్కించుకున్నారు.




# అంతర్జాతీయ క్రికెట్‌కు
# రవిచంద్రన్ అశ్విన్ వీడ్కోలు

### భారత సీనియర్ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ కీలక నిర్ణయం
### అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెబుతున్నట్లు ప్రకటన


భారత సీనియర్ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఆస్ట్రేలియాతో మూడో టెస్టు ముగిసిన అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అశ్విన్ ప్రకటన చేశాడు. అంతకుముందు డ్రెస్సింగ్ రూమ్‌లో విరాట్ కోహ్లీతో అశ్విన్ భావోద్వేగానికి గురైన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ''భారత క్రికెటర్‌గా ఇదే నా చివరి రోజు. అన్ని ఫార్మాట్‌ల నుంచి వీడ్కోలు చెబుతున్నా. క్రికెటర్‌గా నాలో ఇంకాస్త ఆట ఉందని అనుకుంటున్నా. తప్పకుండా క్లబ్ క్రికెట్‌లో ఆడతా. అయితే, అంతర్జాతీయ క్రికెటర్‌గా ఇదే నా చివరి రోజు. ఎన్నో అనుభవాలను అందించిన సహచర క్రికెటర్లకు ధన్యవాదాలు. ఈ సందర్భంగా ఎంతో మందిని గుర్తు చేసుకోవాలి. ముఖ్యంగా బీసీసీఐతో సహా సహచరులకు థ్యాంక్స్. రోహిత్, విరాట్, అజింక్య, పుజారా ఈ జాబితాలో తప్పక ఉంటారు. నా బౌలింగ్‌లో స్లిప్పుల్లో ఎన్నో క్యాచ్‌లను పట్టుకొని నా వికెట్లను అందించారు. ఇక ఆస్ట్రేలియన్ క్రికెట్‌కూ ధన్యవాదాలు. నాకు మంచి పోటీ ఇచ్చిన క్రికెట్ జట్టు. నాకు ఇవి భావోద్వేగానికి గురయ్యే క్షణాలు'' అంటూ అశ్విన్ తెలిపాడు.

**రేపు భారత్‌కు అశ్విన్**

అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకకటించిన అశ్విన్ గురువారం భారత్‌కు రానున్నాడు. ఈ మేరకు కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. మ్యాచ్ అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పలు విషయాలపై రోహిత్ మాట్లాడాడు. అశ్విన్ నిర్ణయాన్ని గౌరవిస్తున్నామని.. మిగిలిన రెండు టెస్టులో అతడు ఆడడని వెల్లడించాడు. స్వదేశానికి వెళ్లిపోతాడని తెలిపాడు. టీమ్ఇండియా తరపున అశ్విన్ 106 టెస్టులు, 116 వన్డేలు, 65 టీ20లు ఆడాడు. మొత్తం 4,400 పరుగులు సాధించాడు. ఓవరాల్‌గా 765 వికెట్లు పడగొట్టాడు.

**అశ్విన్ రిటైర్‌మెంట్‌పై బీసీసీఐ**

''థ్యాంక్యూ అశ్విన్. అద్భుతం, ఇన్నోవేషన్, తెలివైన బౌలర్‌కు పర్యాయపదంగా మారావు. సీనియర్ స్పిన్నర్‌గా భారత్ విజయాల్లో కీలక పాత్ర పోషించావు. లెజండరీ కెరీర్‌ను కొనసాగించినందుకు కంగ్రాట్స్'' అని బీసీసీఐ పోస్టు పెట్టింది. అశ్విన్ వీడ్కోలు నిర్ణయంపై ఆసీస్ టాప్ స్పిన్నర్ నాథన్ లైయన్ కూడా స్పందించాడు. మున్ముందు భవిష్యత్తు మరింత ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు.




# మీడియం పేసర్ నుంచి స్పిన్నర్‌గా.. క్రికెట్ మాస్టర్‌మైండ్ అశ్విన్ ప్రస్థానం..!

వికెట్ నుంచి మద్దతు లేదు.. వాతావరణం సరిగా లేదు.. అసలు స్పిన్నర్‌కి ఈ పిచ్ సరికాదు అనే విశ్లేషణలు ఓ బౌలర్‌కు వర్తించవు. అతడే రవిచంద్రన్ అశ్విన్..! భారత క్రికెట్ వైల్డ్‌ఫైర్..!

దాదాపు పాతికేళ్ల క్రితం చెన్నైలోని సెయింట్ బేడేస్ ఆంగ్లో ఇండియన్ హైస్కూల్‌కు చెందిన ఓ కుర్రాడు నెట్స్‌లో మీడియం పేస్ బౌలింగ్ చేస్తూ అలసిపోయాడు.. కొద్దిసేపు ఆఫ్‌స్పిన్ ట్రై చేస్తానని కోచ్ విజయ్ కుమార్‌ను అడిగాడు. దీనికి ఆయన ఓకే అనడంతో.. బౌలింగ్ చేశాడు. బంతిపై అతడి నియంత్రణ చూసి కోచ్ ఆశ్చర్యపోయాడు. ఆ కుర్రాడిలో ఏదో ప్రత్యేకత ఉందని గుర్తించాడు. మర్నాడు ఎప్పటిలానే నెట్స్‌కు వచ్చి మీడియం పేస్ బౌలింగ్ చేయబోయాడు. కానీ, కోచ్ మాత్రం అంగీకరించలేదు.. స్పిన్ వేయాలని ఆదేశించాడు. నిరాశపడిన ఆ కుర్రాడు అయిష్టంగానే బౌలింగ్ చేశాడు. ఆ తర్వాత అతడి తండ్రితో కోచ్ చర్చించి.. ఆఫ్ స్పిన్‌లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాడు. ఆ ఘటనే భారత్‌కు ఓ అత్యుత్తమ స్పిన్ ఆల్‌రౌండర్‌ను అందించింది. ఆ దిగ్గజం పేరు రవిచంద్రన్ అశ్విన్ ! 500కు పైగా టెస్ట్ వికెట్లను కూల్చిన బౌలర్. చెప్పుకోవడానికి ఆఫ్ స్పిన్నర్ అయినా, జట్టుకు అవసరమైన సందర్భాల్లో బ్యాట్ ఝళిపించగల సత్తా ఉన్నోడు ఈ టీమ్ ఇండియా 'అన్న'.

అశ్విన్ మ్యాచ్‌లో పరిస్థితులను వేగంగా అర్థం చేసుకొని మార్పులు చేసుకోగల సమర్థుడు. తన ఎత్తును అదనపు బలంగా వాడుకొని.. స్పిన్‌లో అదనపు బౌన్స్‌ను రాబట్టడంలో దిట్ట. తమిళనాడు తరపున అండర్16 ఆడే సమయంలో అతడు విసిరిన బంతుల్లో అదనపు బౌన్స్ కారణంగా ప్రత్యర్థి బ్యాటర్లు బాగా ఇబ్బందిపడి ఎల్బీల రూపంలో వెనుదిరిగారని కోచ్ విజయ్ కుమార్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. అశ్విన్ టెస్ట్ కెరీర్‌లో 106 మ్యాచ్‌లు ఆడి 537 వికెట్లు సాధించాడు. వీటిల్లో అత్యధికంగా క్యాచ్‌ల రూపంలో 248.. ఎల్బీల రూపంలో 116 లభించాయి.

**లెఫ్ట్ హ్యాండర్లకు సింహస్వప్నం..**

14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో అశ్విన్ చాలా రికార్డులు దాసోహం చేసుకొన్నాడు. ముఖ్యంగా లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు అతడిని ఎదుర్కోవడానికి భయపడేవారు. టెస్ట్‌ల్లో ఏ బౌలర్ చేయలేని విధంగా 268 సార్లు లెఫ్ట్ హ్యాండర్ల వికెట్లను పడగొట్టడం ఓ రికార్డ్. భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసుకొన్న రెండో బౌలరూ అతడే. అన్ని ఫార్మాట్లు కలిపి 287 మ్యాచ్‌లు ఆడి.. 765 వికెట్లు పడగొట్టాడు. భారత్‌లో కుంబ్లే (956) ఒక్కడే అతడి కంటే ముందున్నాడు.

**అతడి మైండ్.. వ్యూహాల భాండాగారం**

సమకాలీన క్రికెట్‌లో తెలివైన బౌలర్‌గా అశ్విన్‌కు పేరుంది. వికెట్ నుంచి మద్దతు లేదు.. వాతావరణం సరిగా లేదు.. అసలు స్పిన్నర్‌కి ఈ పిచ్ సహకరించదు అని విశ్లేషకులు చెప్పే మాటలు.. అశ్విన్‌కు వర్తించవు. అతడి చేతికి బంతి వచ్చేంతవరకే ఆ లెక్కలు. ఎందుకంటే యాష్ ఎలాంటి పిచ్ మీదనైనా బ్యాటర్‌ను బోల్తా కొట్టించగలడు. అతి జాగ్రత్తకు పోతే.. అట్నుంచి అటే పెవిలియన్‌కు దారి చూపిస్తాడు. ఇది ఏ ఒకటి, రెండుసార్లు కాదు.. ఆయన టెస్టు కెరీర్ చూస్తే.. ప్రతీ సిరీస్‌లోను ఇలాంటి పరిస్థితి ఇన్నాళ్లూ చూశాం.

ఇక తాను బ్యాటర్లను కచ్చితంగా అంచనా వేయగలనని.. గత కొన్నేళ్ల నుంచి దానిని మరింత విశ్లేషణాత్మకంగా మెరుగుపర్చుకొన్నట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. 0.5 శాతం అవకాశాలను కూడా వదిలాలి అనుకోనని పేర్కొన్నాడు. వాస్తవానికి షేన్ వార్న్, ముత్తయ్య మురళీధరన్ స్థాయిలో యాష్ బంతిని తిప్పడు.. కానీ, రికార్డుల్లో మాత్రం వారితో పోటీ పడ్డాడు. వారిద్దరి తర్వాత అత్యధికంగా 37 సార్లు ఐదు వికెట్లు తీసిన ఘనతను అందుకొన్నాడు. అంతేకాదు.. మురళీధరన్‌తో సమానంగా 11 సార్లు ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్లు అందుకోవడం అతడి స్థాయిని చెబుతోంది.

**ఎక్కడైనా.. ఎలాగైనా..**

అశ్విన్ కేవలం బౌలర్ మాత్రమే కాదు.. నాణ్యమైన బ్యాటర్ కూడా. టెస్టుల్లో 25 సగటుతో 3,503 పరుగులు చేశాడు. వీటిల్లో ఆరు శతకాలు, 14 అర్ధ శతకాలున్నాయి. 300 వికెట్లు.. 3,000 పరుగులు సాధించిన అరుదైన 11 మంది ఆటగాళ్లలో అతడూ ఒకడు. ఏ స్థానంలో అయినా సరే బ్యాటింగ్‌కు దిగగల సత్తా అతడి సొంతం. ఈ విషయాన్ని తాజాగా రోహిత్ శర్మే చెప్పాడు. అండర్17లో తమిళనాడు తరపున ఓపెనర్‌గా బరిలోకి దిగేవాడని గుర్తు చేశాడు. అంతర్జాతీయ కెరీర్‌లో మిడిల్ ఆర్డర్, లోయర్ ఆర్డర్‌లో మెరుపులు మెరిపించాడు.

**భారత చరిత్రాత్మక విజయాల్లో భాగస్వామి..**

ఐసీసీ టోర్నీలో అశ్విన్ అద్భుతంగా రాణించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్ కెరీర్‌లో అశ్విన్ ఐసీసీ ట్రోఫీలు సాధించిన జట్లలో కీలకపాత్ర పోషించాడు. 2011 ప్రపంచకప్ జట్టులో సభ్యుడు. ఇక 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ సాధించడంలోనూ కీలకపాత్ర పోషించాడు. ఫైనల్స్‌లో 3.75 సగటుతో నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి 2 వికెట్లు పడగొట్టాడు. 2010, 2016 ఆసియాకప్‌లు సాధించిన జట్లలో సభ్యుడు. ఇక 2023లో వన్డే ప్రపంచకప్, 2017 ఛాంపియన్స్ ట్రోఫీ, 2014 ఐసీసీ టీ20 టోర్నీ, 201921, 202123 టెస్ట్ ఛాంపియన్ షిప్ రన్నరప్ జట్ల సభ్యుడు.

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్‌లో యాష్‌కు ఎదురులేదు. ఈ టోర్నమెంట్‌లో తొలిసారి 100 వికెట్లు సాధించిన బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. మొత్తం 41 మ్యాచ్‌లు ఆడి 195 డిస్మిస్‌లు చేశాడు. అతడి తర్వాత ఆసీస్ బౌలర్ లైయన్ (190) ఉన్నాడు. ఇప్పుడు అశ్విన్ దూరమయ్యాక అలాంటి మెజీషియన్‌ను టీమ్ ఇండియా బాగా మిస్ అవుతుంది.

**ఐపీఎల్‌లో తనదైన ముద్ర..**

2008లో ఐపీఎల్‌లో ధోనీ నాయకత్వంలోని సీఎస్కే తరపున అద్భుతంగా ఆడి అంతర్జాతీయ క్రికెట్‌లో అవకాశాలు దక్కించుకొన్నాడు. అత్యంత ఒత్తిడిలో కూడా జట్టు వ్యూహాలను కచ్చితంగా అమలు చేయగల సమర్థుడిగా పేరు తెచ్చుకొన్నాడు. పవర్ ప్లే ఓవర్లలో బ్యాటర్లను కట్టడి చేస్తాడని అతడికి పేరుంది. 2010, 2011లో జట్టును ఐపీఎల్ విజేతగా నిలపడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత పుణే, పంజాబ్, దిల్లీ, రాజస్థాన్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. చివరికి మళ్లీ 2025 సీజన్ కోసం తన సొంత రాష్ట్రమైన చెన్నై జట్టుకు వచ్చాడు.

**జడ్డూతో కాంబినేషన్ స్పెషల్..**

సమకాలీన టీమ్ ఇండియా టెస్ట్ క్రికెట్‌లో జడేజా యాష్ ద్వయం అత్యంత విధ్వంసకరమైందిగా పేరుంది. ముఖ్యంగా హోం సిరీసులను జట్టుకు అందించడంలో ఈ జోడీదే కీలక పాత్ర. 2024 సెప్టెంబర్ నాటికి వీరు కలిసి 45 టెస్టులు ఆడగా.. 34 మ్యాచ్‌లు భారత్ గెలిచింది. కేవలం మూడు మాత్రమే ఓడిపోయింది. అశ్విన్ 263, జడ్డూ 218 వికెట్లు సాధించారు. ఇక జడ్డూ 1,910 పరుగులు చేయగా.. యాష్ 1,141 రన్స్ సాధించాడు. అంతకుముందు కుంబ్లే భజ్జీ జోడీ 34 టెస్టులు ఆడి 14 విజయాలు, 6 అపజయాలను చవిచూసింది.


# అనిల్ రావిపూడి దర్శకత్వంలో?



కథానాయకుడు చిరంజీవి కొత్త ఏడాదిలో 'విశ్వంభర'తో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే స్పష్టత రానుంది. ఇక దీని తర్వాత చిరు.. దర్శకుడు అనిల్ రావిపూడితో ఓ సినిమా చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీన్ని షైన్ ప్రిక్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు వచ్చిన అనిల్ చిత్రాలకు పూర్తి భిన్నమైన కథాంశంతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఇది ముస్తాబు కానుందని.. దీంట్లో చిరంజీవి క్యారెక్టరైజేషన్ చాలా కొత్తగా ఉంటుందని తెలిసింది. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ సినిమా పట్టాలెక్కనున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ఇక చిరు ఇటీవలే 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెలతో ఓ చిత్రం చేయనున్నట్లు ప్రకటించారు. ఇది అనిల్ సినిమా పూర్తయిన వెంటనే మొదలు కానున్నట్లు తెలుస్తోంది.

# బచ్చల మల్లి'కి క్లైమాక్స్ హైలైట్..!

హీరో అల్లరి నరేష్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'బచ్చల మల్లి' డిసెంబర్ 20న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఈ సినిమాతో అల్లరి నరేష్ మరోసారి తనలోని వెర్సటైల్ యాక్టర్‌ను మనకు చూపించబోతున్నాడు. సీరియస్‌గా సాగే పాత్రలో అల్లరి నరేష్ నటన నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుందని మేకర్స్ ఇప్పటికే తెలిపారు. ఇక ఈ చిత్ర ప్రమోషనల్ కంటెంట్ కూడా ఈ సినిమాపై పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేస్తోంది.అయితే, ఈ సినిమాకు కీలకంగా ఉన్న అంశం ఏమిటనే విషయం పై తాజాగా ఓ వార్త వినిపిస్తోంది. 'బచ్చల మల్లి'లో కావాల్సినంత యాక్షన్, లవ్, మాస్ అంశాలు ఉండనున్నాయి. కానీ, ఈ సినిమాకు హైలైట్‌గా నిలిచేది మాత్రం ఈ మూవీ క్లైమాక్స్ అని తెలుస్తోంది. ఈ చిత్ర క్లైమాక్స్‌లోని ఎమోషన్ ప్రేక్షకులను కట్టిపడేయడం ఖాయమని మూవీ టీమ్ చెబుతోంది. ఈ క్లైమాక్స్ ఎపిసోడ్‌ని చిత్ర యూనిట్ బలమైన ఎమోషనల్ కథతో నింపారని.. ఈ క్లైమాక్స్ చూసిన ఆడియెన్స్ థియేటర్స్ నుంచి బయటకు వచ్చాక కూడా దాని గురించి చర్చించుకుంటారని మేకర్స్ కాన్ఫిడెంట్‌గా చెబుతున్నారు. ఇక ఈ క్లైమాక్స్ పోర్షన్‌లో అల్లరి నరేష్ పర్ఫార్మెన్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉండబోతుందని తెలుస్తోంది. ప్రేక్షకులను ఆయన ఏడిపించడం ఖాయమని చిత్ర యూనిట్ తెలిపింది. మొత్తానికి 'బచ్చల మల్లి' చిత్రానికి క్లైమాక్స్ మేజర్ హైలైట్‌గా నిలవనుందనే వార్తతో ఈ సినిమాపై ఆసక్తి మరింతగా పెరుగుతోంది.



# శంకర్ సంభవం లోడింగ్

ఇప్పుడు మన తెలుగు సినిమా నుంచి రిలీజ్ కి రాబోతున్న మరో భారీ చిత్రం ఏదన్నా ఉంది అంటే అది గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ అలాగే దర్శకుడు శంకర్ కలయికలో తెరకెక్కించిన అవైటెడ్ చిత్రం "గేమ్ ఛేంజర్" కూడా ఒకటి. మరి చరణ్, శంకర్ ఇద్దరి కెరీర్ లో 15వ సినిమాగా నిర్మాత దిల్ రాజు బ్యానర్ లో 50వ సినిమాగా అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మాణం వహించారు. అయితే ఈ సినిమా కోసం మెగా అభిమానులు ఎప్పుడు నుంచో ఎదురు చూస్తుండగా ఈ సినిమా ఫలితం ఇపుడు అటు రామ్ చరణ్ ఫ్యాన్స్ కి అలాగే శంకర్ అభిమానులకి కూడా ఎంతో ప్రత్యేకంగా మారింది. మరి గేమ్ ఛేంజర్ తో శంకర్ సాలిడ్ కం బ్యాక్ కొట్టబోతున్నారని మెగా వర్గాల నుంచి టాక్ ఉండగా ఇపుడు సినీ వర్గాల్లో కూడా గేమ్ ఛేంజర్ అవుట్ పుట్ పై సాలిడ్ బజ్ వినిపిస్తుంది. ఇలా గేమ్ ఛేంజర్ లో మూడు బిగ్గెస్ట్ హైలైట్స్ ఆడియెన్స్ ని మెస్మరైజ్ చేయబోతున్నాయట. వీటిలో మొదటిగా శంకర్ మార్క్ సాంగ్స్ విజువల్ పరంగా ఓ రేంజ్ లో ట్రీట్ ఇవ్వనుండగా ఇవి కాకుండా సినిమాలో ఇంటర్వెల్ బ్యాంగ్ అలాగే క్లైమాక్స్ ట్విస్ట్ లు సినిమాలో అద్దిరిపోతాయని తెలుస్తుంది. దీనితో "గేమ్ ఛేంజర్" తో మాత్రం శంకర్ మాస్ సంభవం లోడింగ్ అని చెప్పాలి.





# ఓజీలో ప్రత్యేక గీతం


టిల్లు భామగా... రాధికగా ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే కథానాయిక నేహాశెట్టి. 'ఓజీ' కోసం ఆమె కొత్త అవతారం ఎత్తింది. ప్రత్యేక గీతంలో ఆడిపాడుతోంది. ఆ పాటని ప్రస్తుతం బ్యాంకాక్‌లో తెరకెక్కిస్తున్నారు. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమే 'ఓజీ'. డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. ఇందులో పవన్‌కల్యాణ్ సరసన ప్రియాంక మోహన్ నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రత్యేకగీతంలో ఆడిపాడే అవకాశాన్ని నేహాశెట్టి సొంతం చేసుకొంది. అగ్ర కథానాయకుడు పవన్‌కల్యాణ్‌తో కలిసి నటించే అవకాశం నేహా కెరీర్‌కి మలుపే. ఇప్పటివరకూ ఆమె పరిమిత వ్యయంతో రూపొందిన చిత్రాల్లోనే నటించింది.

# నందమూరి మోక్షజ్ఞ మూవీపై రూమర్స్



నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ తెరంగేట్రానికి రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే. 'హనుమాన్' దర్శకుడు ప్రశాంత్ వర్మ ఆయన్ను హీరోగా పరిచయం చేయనున్నారు. ఈ సినిమాపై కొన్ని రోజులుగా వస్తున్న రూమర్స్‌పై నిర్మాణ సంస్థ 'ఎస్ఎల్‌వీ సినిమాస్' తాజాగా స్పందించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది.

## కశ్మీర్‌లో అర్జున్ సర్కార్ పోరాటం



మంచు కొండల్లో మంటలు పుట్టిస్తున్నాడు పోలీసు అధికారి అర్జున్ సర్కార్. శత్రువులపై అతని పోరాటం ఎలా సాగిందో, లక్ష్యం దిశగా ఎలా దూసుకెళ్లాడో తెలియాలంటే 'హిట్: ది థర్డ్ కేస్' విడుదల వరకూ ఎదురు చూడాల్సిందే. నాని కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. శ్రీనిధి శెట్టి కథానాయిక. శైలేశ్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు. 'హిట్' ఫ్రాంచైజీలో భాగంగా రూపొందుతున్న మూడో చిత్రమిది. అర్జున్ సర్కార్ అనే పోలీసు అధికారి పాత్రలో నటిస్తున్నారు నాని. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం కశ్మీర్‌లో జరుగుతోంది. నాని, ఫైటర్ల బృందంపై కొన్ని కీలకమైన పోరాట సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. పాత్రకి తగ్గట్టుగా టఫ్ లుక్‌లో నాని ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారని సినీ వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాది మే 1న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాకి సంగీతం: మిక్కీ జె.మేయర్, ఛాయాగ్రహణం: సాను జాన్ వర్ఘీస్.



# శివశక్తి పాట కాశీలో!

నాగచైతన్య కథానాయకుడిగా గీతా ఆర్ట్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'తండేల్'. సాయిపల్లవి కథానాయిక. చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. బన్నీ వాసు నిర్మాత. అల్లు అరవింద్ సమర్పకులు. ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇందులోని ఒకొక్క పాటని వరుసగా విడుదల చేస్తోంది చిత్రబృందం. ఇప్పటికే 'బుజ్జితల్లి...' పాటతో సందడిని మొదలు పెట్టగా, త్వరలోనే 'శివ శక్తి...' పాట విడుదల కోసం చిత్రబృందం కాశీ వెళ్లనుంది. అక్కడి డివైన్ ఘాట్స్‌లో ఈ నెల 22న పాటని విడుదల చేయనున్నారు. "శ్రీకాకుళం సాంస్కృతిక వారసత్వాన్ని, పురాతన శ్రీ ముఖలింగం శివాలయాన్ని ప్రతిబింబించే పాట ఇది. సంగీతం పరంగా, విజువల్‌గా అద్భుతం అనిపించేలా ఉంటుంది. జాతర నేపథ్యంలో సాగే ఈ పాటకి శేఖర్ మాస్టర్ నృత్య దర్శకత్వం వహించారు. ఉత్సాహపూరిత వాతావరణం, ఆధ్యాత్మిక ఇతివృత్తానికీ జీవం పోసేలా ఉంటుంద"ని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఛాయాగ్రహణం: షామ్‌దత్, కూర్పు: నవీన్ నూలి, కళ: శ్రీనాగేంద్ర తంగల.

Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana.
Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor: N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896